
PRGI NO : TGTEL/26/A2002
EDITOR: PEMBI MAHENDHAR
# నవగీతం
NAVAGEETAM DINAPATHRIKA
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 105 | పేజీలు : 8 | శుక్రవారం4 సెప్టెంబర్ 2026 | వెల : 4/-




## ఎగుమతి కేంద్రాలుగా
# 31 జిల్లాలు

- సమ్మిళిత ఎగుమతి వృద్ధిలో తెలంగాణ
- 31 జిల్లాలను ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వం
- వ్యవసాయ, హస్తకళల ఉత్పత్తులకు ఊతం కల్పించే దిశగా అడుగులు
- అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానించేందుకు మార్గం
- హనుమకొండ, భువనగిరి మాత్రం దూరం




హైదరాబాద్

ప్రపంచస్థాయి కెపాసిటీ కలిగిన ఉత్పత్తులు, సేవలను గుర్తించి స్థానిక ఉత్పత్తిదారులను ఇంటర్నేషనల్ మార్కెట్లతో కనెక్టివిటీ చేయడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. దీని ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి జిల్లాను ఒక మంచి ఎక్స్‌పోర్ట్ సెంటర్‌గా మార్చే సమ్మిళిత ఎగుమతి వృద్ధి కార్యక్రమం కింద, రాష్ట్రంలోని 31 జిల్లాలను కేంద్ర ప్రభుత్వం సెలెక్ట్ చేసింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వానికి - మిగతా3లో



## యువత గొంతు నొక్కితే ప్రజలకు సమాధానం చెప్పాల్సిందే

- బీజేపీపై రాహుల్‌గాంధీ ఫైర్
- బిహార్‌లో పరీక్షా వ్యవస్థలో అవకతవకలకు వ్యతిరేకంగా విద్యార్థుల ఆందోళన
- పోలీసుల చర్యల్లో పలువురు విద్యార్థులు గాయపడ్డారని రాహుల్‌గాంధీ వ్యాఖ్య
- యువత గొంతును అణచివేసే ప్రభుత్వాలు ప్రజలకు సమాధానం చెప్పక తప్పదని హెచ్చరిక

## మంత్రివర్గం నుంచి
# కొండా బర్తరఫ్

- తక్షణం కొండా సురేఖను బర్తరఫ్ చేయాలంటూ లేఖ పంపిన సీఎం
- రాజీనామాకు కొండా సురేఖ ససేమిరా అనడంతో బర్తరఫ్ నిర్ణయం
- సీఎం రేవంత్‌రెడ్డి సిఫార్సును ఆమోదించిన గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా
- రాష్ట్ర ప్రభుత్వం రెండు కీలక పదవుల్లో కూడా మార్పులు
- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుండి జి.చిన్నారెడ్డిని తొలగించి, ఆ స్థానంలో గద్వాల్ విజయలక్ష్మి నియమాకం
- తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద



హైదరాబాద్

రాష్ట్ర కాంగ్రెస్‌లో కొద్దిరోజులుగా నలుగుతున్న కొండా సురేఖ ఎపిసోడ్‌కు తెరపడింది. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి గవర్నర్ శివ్ ప్రసాద్ శుక్లాకు కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని లేఖను పంపడంతో ఆయన ఆమోదం తెలిపారు. దీంతో మంత్రి కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగించినట్లైంది. అంతకు ముందు కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించేందుకు ఏఐసీసీ క్లియరెన్స్ ఇచ్చింది. దీంతో తక్షణమే కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలంటూ సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్‌కు పంపిన లేఖలో స్పష్టం చేశారు. కొండా సురేఖను మంత్రి పదవికి రాజీనామా చేయాలని కోరినా అందుకు ఆమె నిరాకరించింది. దీంతో బర్తరఫ్ చేయాలని - మిగతా3లో

## రేవంత్ రెడ్డి బ్లాక్‌మెయిల్ చేసి నన్ను బర్తరఫ్ చేయించారు

- రాజీనామా చేయమని నన్నెవరూ అడగలేదని వివరణ
- అధిష్ఠానానికి ఇచ్చిన లేఖను మీడియాకు ఇచ్చిన సురేఖ



## క్లీన్ ఎనర్జీ, కీలక ఖనిజాలపై దృష్టి

- ఘర్షణలకు చర్చలు, దౌత్యమే మార్గం'
- భారత ఆర్థిక వృద్ధి వల్ల ప్రపంచానికి కొత్త అవకాశాలు
- ఉక్రెయిన్, పశ్చిమాసియాలో ఘర్షణలకు త్వరగా ముగింపు పలకాలన్న ప్రధాని మోదీ.. బెల్జియం మధ్య కీలక ఒప్పందాలు



# అభివృద్ధిని అడ్డుకుంటున్నారు



- గుజరాత్‌కు గులాంగిరీ చేస్తున్నారు
- మురుగు సమస్య లేకుండా చేస్తాం
- పాతబస్తీ మెట్రోను పూర్తి చేస్తామని చెప్పాం - చేసి చూపిస్తాం
- హైదరాబాద్‌లో రెండో భారీ స్టీల్ ఫ్లై ఓవర్ ప్రారంభం
- చంచల్‌గూడ-సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- మీరాలం ట్యాంక్‌పై రూ.500 కోట్లతో కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తున్నామన్న సీఎం

హైదరాబాద్

గత సర్కార్ చంచల్‌గూడ-సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్ నిర్మాణానికి సకాలంలో నిధులు ఇవ్వలేదన్న సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి వేగంగా వంతెన నిర్మాణం పూర్తి చేసిందని తెలిపారు. చంచల్‌గూడ-సంతోష్‌నగర్ రెండో స్టీల్ ఫ్లైఓవర్‌ను రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. ఈ ప్రాంతమంతా ఓల్డ్ సిటీ కాదని ఇది ఒరిజినల్ సిటీ అని కొనియాడారు. ఒకప్పుడు హైదరాబాద్ నగర ప్రజలు ఈసీ, మూసీ నది నీళ్లు తాగేవారని, హైదరాబాద్‌కు విదేశీయులు ఎవరు వచ్చినా చార్మినార్ వద్ద షాపింగ్‌కు వస్తారని గుర్తు చేశారు. పాతబస్తీలోని ప్రతి గల్లీ, అణువణువు తనకు తెలుసునని స్పష్టం చేశారు. ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ - మిగతా3లో



## అమెరికాతో ట్రేడ్ డీల్‌పై భారత్ కీలక షరతు

- మన వస్తువులకు తక్కువ టారిఫ్‌లను ప్రతిపాదిస్తేనే!
- పోటీ దేశాల కంటే భారత్‌కు మెరుగైన టారిఫ్ రేట్లు ఇవ్వాలని అమెరికాకు స్పష్టం
- అనుకూల నిబంధనలు ఖరారైన వెంటనే బీటీఏ తుది వివరాలు ప్రకటిస్తామని పీయూశ్ గోయల్ వెల్లడి

# రైతుల కోసం పాదయాత్ర చేస్తా

- రైతు డిక్లరేషన్ హామీలేమయ్యాయి?
- కేసీఆర్ పాలనలో రైతులు ఎలా ఉన్నారో.. ఇప్పుడు ఎలా ఉన్నారో ఒక్కసారి ప్రభుత్వం ఆలోచన చేయాలి
- ఇప్పటివరకూ వెయ్యి రోజుల పడకల పాము పాలన చూశాం
- మిర్యాలగూడలో రైతు ధర్నాను అడ్డుకునేందుకు కుట్ర చేశారు.
- కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే యూరియా కోసం చెప్పులు లైన్లో పెట్టే రోజు వస్తుంది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నల్లగొండ:

గతంలో నీళ్ల కోసం కోదాడ నుంచి హాలియా వరకూ కేసీఆర్ పాదయాత్ర చేశారని, ఇప్పుడు వినాయక చవిత లోపల నీటి షెడ్యూల్‌ను విడుదల చేయకపోతే అదే కోదాద నుంచి హాలియా వరకూ తాను పాద్రయాత్ర చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. కేసీఆర్ పాలనలో రైతులు ఎలా ఉన్నారో.. ఇప్పుడు ఎలా ఉన్నారో ఒక్కసారి ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు. ఇప్పటివరకూ వెయ్యి రోజుల పడకల పాము పాలన చూశామని విమర్శించారు కేటీఆర్ గురువారం, నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడలో రైతు ధర్నాలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ - మిగతా3లో

## రాహుల్‌పై ఎన్ని ఎఫ్ఐఆర్ పెట్టినా భయపడేది లేదు



- హల్ద్వానీ ర్యాలీ ప్రాంగణంలో శుద్ధీకరణపై వివాదం
- దళితుల కోసం గొంతెత్తిన రాహుల్‌ను భయపట్టేందుకే ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్న మల్లికార్జున ఖర్గే
- ఎన్ని కేసులు పెట్టినా ఎదుర్కొంటామంటూ కాంగ్రెస్ అధ్యక్షుడి వ్యాఖ్యలు
- హల్ద్వానీ ఘటనను కేవలం శుద్ధీకరణగా చూడలేం
- "రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రతిపక్ష నేత. పార్లమెంట్‌లోనే కాకుండా బయట కూడా ప్రజా సమస్యలపై గొంతెత్తుతున్నారు
- విద్యార్థులు, మహిళలు, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, దళితుల సమస్యలపై ప్రశ్నిస్తున్నారు.

# క్లీన్ ఎనర్జీ, కీలక ఖనిజాలపై దృష్టి

ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక, ఆర్థిక అనిశ్చితులు కొనసాగుతున్న వేళ భారత్, బెల్జియం ద్వైపాక్షిక సంబంధాలను మరింత వ్యూహాత్మక స్థాయికి తీసుకెళ్లాలని నిర్ణయించాయి. ప్రధాని నరేంద్ర మోదీ, బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ మధ్య గురువారం విస్తృత చర్చలు జరిగాయి. అందులో వాణిజ్యం, రక్షణ, కీలక ఖనిజాలు, క్లీన్ ఎనర్జీ, అధునాతన సాంకేతికత వంటి అంశాలపై ప్రధానంగా చర్చించారు. రెండు దేశాల మధ్య సహకారాన్ని మరింత విస్తరించేందుకు పలు నిర్ణయాలు తీసుకున్నారు. చర్చల అనంతరం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోదీ ప్రపంచ పరిస్థితులు, భారత్ ఆర్థిక ప్రగతి, శాంతి-భద్రత వంటి అంశాలపై మాట్లాడారు. ప్రస్తుతం ప్రపంచం తీవ్ర మార్పులు, అనిశ్చితితో కూడిన పరిస్థితులను ఎదుర్కొంటోందని అన్నారు.

ఆహారం, ఇంధనం, సరఫరా వ్యవస్థల నుంచి దాదాపు ప్రతి రంగంపైనా అంతర్జాతీయ పరిణామాల ప్రభావం పడుతోందని మోదీ పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ తన వేగాన్ని కొనసాగిస్తోందని చెప్పారు. ఇటీవల ముగిసిన త్రైమాసికంలో భారత్ 7.8 శాతం ఆర్థిక వృద్ధిని నమోదు చేసిందని వెల్లడించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో భారత్ వృద్ధి కొనసాగడం సానుకూల పరిణామమని పేర్కొన్నారు. దేశ ఆర్థిక ప్రగతి ఇప్పుడు ప్రపంచానికి విశ్వాసాన్ని కలిగించడంతో పాటు కొత్త అవకాశాలకు దారితీస్తోందని మోదీ అన్నారు.

ఇక ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న యుద్ధాలు, ఉద్రిక్తతలపైనా ఇరువురు నేతలు చర్చించారు. ఉక్రెయిన్, పశ్చిమాసియా ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులపై భారత్ వైఖరిని మోదీ మరోసారి స్పష్టం చేశారు. అంతర్జాతీయ వివాదాలకు చర్చలు, దౌత్యం, న్యాయపాలన ఆధారంగా పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉందన్నారు.



ఉక్రెయిన్ లేదా పశ్చియాసియా అయినా ఘర్షణలు త్వరగా ముగిసి శాంతి నెలకొనేందుకు చేపట్టే ప్రయత్నాలకు భారత్?, బెల్జియం మద్దతు ఇస్తాయని తెలిపారు. ఉగ్రవాదంపై కూడా ఇరుదేశాలు ఒకే వైఖరిని కలిగి ఉన్నాయని మోదీ చెప్పర్శ. ఉగ్రవాదాన్ని ఏ రూపంలో ఉన్నా నిర్మూలించేందుకు కలిసి పనిచేయడం రెండు దేశాల ఉమ్మడి బాధ్యతగా పేర్కొన్నారు.

భారత్?, బెల్జియం మధఅయ భవిష్యత్ సహకారంలో క్లీన్ ఎనర్జీ, సురక్షితమైన సరఫరా వ్యవస్థలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించి ఇరుదేశాల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఇది సుస్థిర ఇంధన రంగంలో ద్వైపాక్షిక భాగస్వామ్యానికి మరింత ఊతమిస్తుందని మోదీ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా కీలక ఖనిజాలకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ రంగంపైనా ఇరుదేశాలు దృష్టి సారించాయి. ఖనిజాల ప్రాసెసింగ్, రీసైక్లింగ్‌లో సహకారాన్ని పెంచుకోవాలని నిర్ణయించినట్లు ప్రధాని తెలిపారు. సరఫరా వ్యవస్థలను బలోపేతం చేసేందుకు ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

### సెమీకండక్టర్లలో పరస్పర ప్రయోజనం

అధునాతన సాంకేతిక రంగంలోనూ భారత్, బెల్జియం మధ్య సహకారానికి విస్తృత అవకాశాలున్నాయని ప్రధాని మోదీ చెప్పారు. ముఖ్యంగా సెమీకండక్టర్ రంగంలో బెల్జియం సాంకేతిక నైపుణ్యం, భారత్ వద్ద ఉన్న విస్తృత స్థాయి ఉత్పత్తి సామర్థ్యం ఒకదానికొకటి అనుకూలంగా ఉంటాయని పేర్కొన్నారు. రక్షణ రంగంలోనూ భాగస్వామ్యాన్ని పెంచుకునేందుకు ఇరుదేశాలు ఆసక్తి చూపాయి. ఆధునిక రక్షణ సాంకేతికత పరికరాల తయారీ, పరిశ్రమల మధ్య భాగస్వామ్యానికి అవకాశాలను అన్వేషించున్నాయి.

### 'ఈయూ-భారత్ వాణిజ్య బంధానికి ఊతం'

భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం రెండు దేశాల సంబంధాలకు కొత్త అవకాశాలను తెరుస్తుందని బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ అన్నారు. భారత్, యూరప్ మధ్య ఆర్థిక సంబంధాలు మరింత బలోపేతం కావడానికి ఈ ఒప్పందం కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. భారత్, యూరోపియన్ యూనియన్ ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య శక్తుల్లో రెండుగా ఉన్నాయని మోదీ గుర్తుచేశారు. రెండు పక్షాల మధ్య పెరుగుతున్న సహకారం ప్రపంచ స్థిరత్వం, ఆర్థిక వృద్ధి, ఉమ్మడి అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు.

### రెండు దశాబ్దాల తర్వాత భారత్‌లో పర్యటన

బార్ట్ డి వెవర్ మూడు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా భారత్‌కు వచ్చారు. 2025 ఫిబ్రవరిలో బెల్జియం ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన భారత్‌కు రావడం ఇదే తొలిసారి. అంతేకాదు దాదాపు రెండు దశాబ్దాల తర్వాత బెల్జియం ప్రధానమంత్రి భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. ఆయన వెంట బెల్జియం రక్షణ, విదేశీ వాణిజ్య మంత్రి థియో ఫ్రాంకెన్‌తో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు, వ్యాపార ప్రముఖులతో కూడిన ప్రతినిధి బృందం వచ్చింది. బెల్జియం రక్షణ పరిశ్రమకు చెందిన ప్రతినిధులు కూడా ఈ పర్యటనలో పాల్గొన్నారు.

# యువత గొంతు నొక్కితే ప్రజలకు సమాధానం చెప్పాల్సిందే

బిహార్?లో పరీక్షా వ్యవస్థలో అవకతవకలు, ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థులకు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ మద్దతు తెలిపారు. ఆందోళనకారులపై పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా తప్పుబట్టారు. యువత గొంతును అణచివేసే ఏ ప్రభుత్వమైనా చివరికి ప్రజలకు సమాధానం చెప్పాల్సిందేనని బీజేపీని ఉద్దేశించి హెచ్చరించారు. పరీక్షల్లో అక్రమాలు, నియామక ప్రక్రియలో పారదర్శకత కోరుతూ పోలీసుల చర్యలను ఎదుర్కొన్న బిహార్ విద్యార్థులు, యువతను రాహుల్‌గాంధీ కలిశారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తన స్పందనను వెల్లడించారు. విద్యార్థులు తమ హక్కుల కోసం పారదర్శకమైన పరీక్షా విధానం కోసం మాత్రమే ఆందోళన చేశారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అయితే వారిపై లాఠీచార్జ్?తో పాటు ఏకే-47, పిస్టళ్లతో కాల్పులు జరిగాయని ఆరోపించారు. ఈ ఘటనల్లో పలువురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలని కలలు కన్న ఓ యువకుడి కాలికి ఏకే-47 బుల్లెట్ తగిలిందని పేర్కొన్నారు. ఆ బుల్లెట్ అతడి కాలినే కాకుండా జీవితాంతం కన్న సైనికుడిగా మారాలన్న కలను కూడా ఛిద్రం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

### 'ఇంతటి బలప్రయోగం ఎందుకు?'

విద్యార్థుల కోరింది న్యాయమైన అవకాశాలు, పారదర్శకమైన పరీక్షా వ్యవస్థ, తమ హక్కులేనని రాహుల్ గాంధీ అన్నారు.



ఇలాంటి డిమాండ్లతో నిరసన చేస్తున్న యువతపై లాఠీలు, తుపాకీ కాల్పులు జరపాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఈ ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. కేవలం కొందరు కింది స్థాయి అధికారులపై నిందలు వేసి ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకోలేదని స్పష్టం చేశారు. ఇంతటి తీవ్ర బలప్రయోగం ఉన్నతస్థాయి ఆదేశాల ఫలితమైనా, లేదా పరిపాలనా వ్యవస్థ పూర్తిగా విఫలమైందనడానికి నిదర్శనమైనా కావచ్చని వ్యాఖ్యనించారు. బిహార్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా ఆందోళన చేస్తున్న యువతకు తాను అండగా ఉంటానని తెలిపారు. వారికి అవసరమైన ప్రతి సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నానని హామీ ఇచ్చారు. యువత గొంతును అణచివేసే ఏ పాలన అయినా చివరకు ప్రజలకు సమాధానం చెప్పాల్సిందేనని, ఆ రోజు ఎంతో దూరంలో లేదంటూ బీజేపీని ఉద్దేశించి రాహుల్‌గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

### పట్నాలో ఉద్రిక్త పరిస్థితులు

బిహార్‌లో విద్యార్థుల ఆందోళనలు ఆగస్టు మొదటి వారంలో ప్రారంభమయ్యాయి. ఉపాధ్యాయ ఉద్యోగ నియామక పరీక్షను ఒకే దశలో నిర్వహించాలని, నియామక ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగార్థులు నిరసనలకు దిగారు. గత నెలలో ఆందోళనకారులు ముఖ్య మంత్రి నివాసం వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించడంతో పట్నాలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు, నిరసనకారుల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. ఈ క్రమంలో పోలీసులు బలప్రయోగం చేశారనే ఆరోపణలు వచ్చాయి. బిహార్ విద్యార్థుల ఉద్యమానికి వివిధ ప్రతిపక్ష పార్టీల నేతలు మద్దతు ప్రకటిస్తున్నారు. ఆర్?జేడీ వర్కింగ్ ప్రెసిడెంట్ తేజస్వీ యాదవ్ కూడా విద్యార్థుల డిమాండ్లకు మద్దతుగా నిలిచారు. తాజాగా రాహుల్‌గాంధీ వారిని స్వయంగా కలిసి సంఘీభావం ప్రకటించడంతో ఈ అంశం మరోసారి రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదిలా ఉండగా, రాహుల్ గాంధీపై ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో ఎఫ్ఐఆర్ నమోదైంది. దీనిని కాంగ్రెస్ కార్యకర్తలు ఉత్తరాఖండ్‌లోని పలు ప్రాంతాల్లో ఆందోళనలు చేపట్టారు. కేసును ఉపసంహరించుకోవాలని, శుద్ధీకరణ కార్యక్రమంలో పాల్గొన్న వారిపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతలు కూడా ఆ అంశంపై చట్టపరంగా, ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడతామని ప్రకటించారు.

# అమెరికాతో ట్రేడ్ డీల్‌పై భారత్ కీలక షరతు

అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై కేంద్రమంత్రి పీయూశ్ గోయల్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇతర దేశాల ఉత్పత్తుల కంటే భారత్ వస్తువులకు తక్కువ టారిఫ్‌లను ప్రతిపాదిస్తే అమెరికాతో వెంటనే ఒప్పందం కుదుర్చుకుంటామని అన్నారు. బీటీఏ తుది వివరాలను అప్పుడే ప్రకటిస్తామని తెలిపారు. గురువారం దిల్లీలో నిర్వహించిన 'లీవరేజింగ్ ఎఫ్‌టీఏస్ అవుట్‌రీచ్' జాతీయ వర్క్‌షాప్‌లో పీయూశ్ గోయల్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఇప్పటికే భారత్ కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు దేశీయ వ్యాపారులకు గణనీయమైన ఎగుమతి అవకాశాలను తెరుస్తున్నాయని పీయూశ్ గోయల్ తెలిపారు. రానున్న నెలలు, సంవత్సరాల్లో మరిన్ని దేశాలతో వాణిజ్య ఒప్పందాలను పూర్తి చేసుకునే దిశగా భారత్ ముందుకు సాగుతోందన్నారు. ఈ క్రమంలో కెనడా, మెక్సికో, చిలీ, బ్రెజిల్ నేతృత్వంలోని మెర్కోసూర్ కూటమి, సదరన్ ఆఫ్రికన్ కస్టమ్స్ యూనియన్ (ఎస్?ఏసీయూ), గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ), ఇజ్రాయెల్ తదితర దేశాలు, కూటములతో వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. తొమ్మిది దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల ప్రపంచ వాణిజ్యంలో దాదాపు మూడింట రెండొంతుల మార్కెట్‌లోకి భారత్ వస్తువులకు నేరుగా ప్రవేశం లభిస్తోందని వెల్లడించారు.

### కీలక అంశాలపై చర్చలు

భారత్, అమెరికా కొంతకాలంగా పరస్పర ప్రయోజనకరమైన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుపుతున్నాయి. ఇటీవల అమెరికా వాణిజ్య ప్రతినిధి అంబాసిడర్ జేమీసన్ గ్రీర్ జూన్ 22 నుంచి 24 వరకు దిల్లీ పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా పీయూశ్ గోయల్‌తో కలిసి బీటీఏకు సంబంధించిన కీలక అంశాలను సమీక్షించారు. ఇరు దేశాల మధ్య మార్కెట్ యాక్సెస్, డిజిటల్ వాణిజ్యం, సరఫరా వ్యవస్థ స్థిరత్వం, నాన్-టారిఫ్ అడ్డంకుల తగ్గింపు, వ్యూహాత్మక రంగాల్లో సహకారం వంటి అంశాలపై చర్చలు జరిగాయి.




చర్చల్లో గణనీయమైన పురోగతి సాధించినట్లు ఇరు దేశాల ప్రతినిధులు పేర్కొన్నారు. వ్యాపారులు, రైతులు, కార్మికులు, వినియోగదారులకు స్పష్టమైన ప్రయోజనాలు చేకూరేలా సమతుల్యమైన, వాణిజ్యపరంగా అర్థవంతమైన ఒప్పందాన్ని కుదుర్చుకోవాలన్న నిబద్ధతను ఇరు దేశాలు పునరుద్ఘాటించాయి.

### ఫిబ్రవరిలోనే ఒప్పందానికి ఫ్రేమ్‌వర్క్

భారత్, అమెరికా ఈ ఏడాది ఫిబ్రవరిలో పరస్పర ప్రయోజనకరమైన వాణిజ్యానికి సంబంధించిన ఇంటరిమ్ అగ్రిమెంట్ కోసం ఒక ఫ్రేమ్‌వర్క్‌ను ప్రకటించాయి. అదే సమయంలో విస్తృత స్థాయిలో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం దిశగా చర్చలు కొనసాగించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి. జూన్‌లో అమెరికా వాణిజ్య ప్రతినిధి నేతృత్వంలోని బృందం భారత్‌కు రావడంతో చర్చలు మరింత ముందుకు సాగాయి. అయితే తుది ఒప్పందం విషయంలో భారత్ తన పోటీ దేశాలతో పోలిస్తే మెరుగైన సుంక ప్రయోజనాలపై పట్టుబడుతున్నట్లు గోయల్ తాజా వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

### భారీగా పెరిగిన ద్వైపాక్షిక వాణిజ్యం

అమెరికా భారత్‌కు అత్యంత కీలకమైన వాణిజ్య భాగస్వాముల్లో ఒకటి. 2025లో ఇరు దేశాల మధ్య వస్తు వాణిజ్యం మొత్తం 149.42 బిలియన్ డాలర్లకు చేరింది. ఇందులో భారత్ నుంచి అమెరికాకు జరిగిన వస్తు ఎగుమతుల విలువ 103.82 బిలియన్ డాలర్లు కాగా, అమెరికా నుంచి భారత్‌కు జరిగిన ఎగుమతులు సుమారు 45.6 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. సేవల రంగంలోనూ ఇరు దేశాల మధ్య భారీ స్థాయిలో వాణిజ్యం జరిగింది. 2025లో ద్వైపాక్షిక సేవల వాణిజ్యం 92.23 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఇందులో భారత్ అమెరికాకు 48.67 బిలియన్ డాలర్ల విలువైన సేవలను ఎగుమతి చేయగా, అమెరికా నుంచి భారత్ సుమారు 43.56 బిలియన్ డాలర్ల సేవలను దిగుమతి చేసుకుంది.

## రాహుల్‌పై ఎన్ని ఎఫ్ఐఆర్ పెట్టినా భయపడేది లేదు

ఉత్తరాఖాండ్ హల్ద్వానీ ర్యాలీ ప్రాంగణంలో జరిగిన శుద్ధీకరణపై వివాదం కొనసాగుతున్న వేళ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదవ్వడంపై ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా స్పందించారు. లోక్?సభ ప్రతిపక్ష నేత రాహుల్?ను భయపెట్టడం, మానసికంగా దెబ్బతీయడమే లక్ష్యంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయించారని ఆరోపించారు. ఎన్ని ఎఫ్ఐఆర్‌లు పెట్టినా కాంగ్రెస్ భయపడబోదని స్పష్టం చేశారు. ఈ మేరకు దిల్లీలో గురువారం మీడియాతో మాట్లాడుతూ ఖర్గే పలు వ్యాఖ్యలు చేశారు.

హల్ద్వానీ ఘటనను కేవలం శుద్ధీకరణగా చూడలేమని మల్లికార్జున ఖర్గే అన్నారు. ఇది అంటరానితనానికి సంబంధించిన ఘటనగా అభివర్ణించారు. దళితులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు, ద్రవ్యోల్బణం వంటి అంశాలపై రాహుల్ నిరంతరం ప్రశ్నలు లేవనెత్తుతున్నారని ఆయన చెప్పారు. అలాంటి నాయకుడిపై కేసులు పెట్టి ఆయన గొంతును నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. దళితుల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న రాహుల్?ను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా రాజకీయ కక్ష సాధించాలనుకుంటే అది సాధ్యం కాదని స్పష్టం చేశారు.

"రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రతిపక్ష నేత. పార్లమెంట్‌లోనే కాకుండా బయట కూడా ప్రజా సమస్యలపై గొంతెత్తుతున్నారు. విద్యార్థులు, మహిళలు, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, దళితుల సమస్యలపై ప్రశ్నిస్తున్నారు. దళితుల కోసం పోరాడుతున్న నాయకుడిని ఎఫ్ఐఆర్?లతో భయపెట్టాలని చూస్తే కాంగ్రెస్ భయపడదు. వాళ్లు ఎన్ని ఎఫ్?ఐఆర్?లు పెట్టాలనుకుంటే అన్ని పెట్టుకోవచ్చు. మేం వాటిని ఎదుర్కొంటాం. దళితుల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న రాహుల్? గాంధీని ఇలా లక్ష్యంగా చేసుకోవడం ద్వారా రాజకీయ కక్ష సాధించాలనుకుంటే అది సాధ్యం కాదు."

### హల్ద్వానీ ర్యాలీతో మొదలైన వివాదం

ఆగస్టు 8వ తేదీన జరిగిన కాంగ్రెస్ పార్టీ ర్యాలీ ఆ వివాదానికి కారణమైంది. హల్ద్వానీ రాంలీలా మైదానంలో కాంగ్రెస్ భారీ ర్యాలీ నిర్వహించింది. ఆ సభలో మల్లికార్జున ఖర్గే పాల్గొన్నారు. అనంతరం కొందరు వ్యక్తులు అదే ప్రాంగణంలో శుద్ధీకరణ యజ్ఞం నిర్వహించారు. దీంతో కాంగ్రెస్ నేతలు దానిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ ఘటన దళిత నాయకుడైన తనను అవమానించడమేనని ఖర్గే రాజ్యసభలో ప్రస్తావించారు. "నేను దళిత సమాజానికి చెందిన వ్యక్తిని. నా గురించి ఒక నాయకుడు మాట్లాడిన తర్వాత ఇలాంటి ఘటన జరగడం సరైనది కాదు. ఇది నా ఒక్కరి సమస్య కాదు. దేశంలో దళితులందరి సమస్య" అని ఇటీవల ఖర్గే పేర్కొన్నారు. రాహుల్ గాంధీ కూడా ఆ ఘటనపై తీవ్రంగా స్పందించారు. ర్యాలీ ప్రాంగణంలో శుద్ధీకరణ పేరుతో జరిగిన కార్యక్రమాన్ని అంటరానితనానికి మరో రూపంగా అభివర్ణించారు. ఆ కార్యక్రమానికి బాధ్యులైన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అయితే రాహుల్ వ్యాఖ్యలపై హల్ద్వానీకి చెందిన వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన అమిత్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు ఎస్సీ వర్గం మనోభావాలను దెబ్బతీశాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఆగస్టు 30న రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీస్ నిరోధక) చట్టంలోని సెక్షన్ 3(1)(తీ), 3(1)(బ)తో పాటు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 196 కింద కేసు నమోదు చేశారు.

### నడ్డాకు ఖర్గే లేఖ

హల్ద్వానీ ఘటనపై రాజ్యసభలో ప్రభుత్వం ఇచ్చిన హామీని కూడా ఖర్గే ప్రస్తావించారు. ఈ అంశంపై ఆగస్టు 13న రాజ్యసభలో తాను మాట్లాడినప్పుడు కేంద్ర ప్రభుత్వం స్పందించిందని గుర్తుచేశారు. ఘటనపై విచారణ జరిపి తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అప్పట్లో రాజ్యసభలో హామీ ఇచ్చారని తెలిపారు. ఈ హామీ అమలుపై రాజ్యసభలోని ప్రభుత్వ పక్ష నేత జేపీ నడ్డాకు ఖర్గే లేఖ రాశారు. 24 రోజులు గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని లేఖలో పేర్కొన్నారు. రాజ్యసభలో జరిగిన పరిణామాలన్నింటినీ లేఖలో వివరించానని, నడ్డా నుంచి సమాధానం కోసం ఎదురుచూస్తున్నానని చెప్పారు. అప్పట్లో రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్ కూడా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారని ఖర్గే గుర్తుచేశారు. ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం చెప్పిన నేపథ్యంలో, ఇప్పుడు రాహుల్ గాంధీపైనే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా, రాహుల్‌పై ఎఫ్ఐఆర్ నమోదును నిరసిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు ఉత్తరాఖండ్‌లోని పలు ప్రాంతాల్లో ఆందోళనలు చేపట్టారు. కేసును ఉపసంహరించుకోవాలని, శుద్ధీకరణ కార్యక్రమంలో పాల్గొన్న వారిపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతలు కూడా ఆ అంశంపై చట్టపరంగా, ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడతామని ప్రకటించారు.

## ఆ వ్యాలీలో 9% ప్రాంతం డేంజర్ జోన్‌లో

## 58శాతం జనాభా రిస్క్‌లో

### కొండచరియల ప్రమాద అవకాశాలపై కీలక రీసెర్చ్!

ఆకస్మిక వరదలు కారణంగా నేపాల్‌లో జరిగిన ఘోర విషాదం తర్వాత హిమాలయ రాష్ట్రాల భద్రత గురించి ఒకింత ఆందోళన నెలకొంది. హిమాలయ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటం అత్యంత ప్రమాదకరమైన భౌగోళిక విపత్తులలో ఒకటిగా మారిపోయింది. గత కొన్ని దశాబ్దాలుగా ఆ ప్రాంతంలో కొండ చరియలు విరిగిపడడం వల్ల అపారమైన ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో ఉత్తరాఖండ్‌లోని చైనా సరిహద్దు జిల్లా అయిన పిథోర్‌గఢ్‌లో ఉన్న దర్మా లోయలో కొండచరియల విరిగేపడే ముప్పు, ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు, సంబంధిత నష్టాలపై డెహ్రాడూన్‌లోని వాడియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ జియాలజీకి చెందిన శాస్త్రవేత్తలు ఒక అధ్యయనం చేశారు. ఈ అధ్యయనం ప్రకారం దర్మా లోయలోని దాదాపు 9శాతం ప్రాంతం అత్యంత ప్రమాదకరమైన, సున్నితమైన జోన్‌లో ఉంది. ఆ ప్రాంతంలోని మొత్తం జనాభాలో దాదాపు 58శాతం మంది ప్రజలు రిస్క్ జోన్‌లో నివసిస్తున్నారు. ఈ అధ్యయనం పర్వత రాష్ట్రమైన ఉత్తరాఖండ్‌లో విపత్తు ప్రమాద హెచ్చరికను సూచిస్తోంది. దర్మా లోయలో 22 శాతం ప్రాంతం మధ్యస్థ డేంజర్ జోన్‌లో, 26 శాతం లో-రిస్క్ జోన్‌లో ఉన్నట్లు ఈ అధ్యయనం తేల్చింది. అలాగే మరో 43 శాతం వెరీ లో-రిస్క్ జోన్‌లో ఉన్నట్లు రీసెర్చ్‌లో వెల్లడైంది. కాగా, సరిహద్దు జిల్లా అయిన పిథోర్‌గఢ్‌లోని దర్మా లోయలో కొండచరియల విరిగిపడే ప్రమాదం కేవలం సహజ వాలులకే పరిమితం కాదు. రోడ్లు, నివాస ప్రాంతాలు, ఆనకట్టలు, వేలాది మంది ప్రజలు కూడా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. అందుకే వాడియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ జియాలజీకి చెందిన శాస్త్రవేత్తలు దర్మా లోయలో కొండచరియలు విరిగిపడే అవకాశాలను ప్రత్యేకంగా అధ్యయనం చేశారు. మెషిన్ లెర్నింగ్, రిమోట్ సెన్సింగ్, వర్షపాతం, భూకంప తీవ్రతపై డేటాను ఉపయోగించి ఈ ముప్పును అంచనా వేశారు. వాడియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ జియాలజీ రీసెర్చ్ ప్రకారం, దర్మా లోయలో తవాఘాట్, జంకు, ఖేత్, సోబ్లా, దార్, బాలింగ్, చంకమ్, ఉర్తింగ్, మండప్, నాగ్లింగ్, ఫిలామ్, దుగ్తు, బాన్, గోయి, మార్చా, టిడాంగ్, సిపు సహా పలు గ్రామాలున్నాయి. ఇవి సముద్ర మట్టానికి సుమారు 1,150 మీటర్ల నుంచి 3,410 మీటర్ల ఎత్తులో ఉన్నాయి. ఈ ప్రాంతంలో సగటు వార్షిక వర్షపాతం 2,000- 2,500 మిల్లీమీటర్లు. మొత్తం వర్షపాతంలో సుమారు 82 శాతం రుతుపవనాల కాలంలో (జూన్- సెప్టెంబర్ వరకు) కురుస్తుంది. ఉపగ్రహ చిత్రాలు, గూగుల్ ఎర్త్ చిత్రాలు, క్షేత్రస్థాయి సర్వేల ఆధారంగా 2001-2023 మధ్య ఈ దర్మా లోయలో 295 కొండచరియల విరిగిపడే సంఘటనలు సంభవించినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. వాడియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ జియాలజీ సైంటిస్టులు చేసిన ఈ అధ్యయనం కేవలం కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించడానికే పరిమితం కాలేదు. వర్షపాతం, భూకంపాలపై డేటాను కూడా సేకరించారు. అందుకోసం గత 40 సంవత్సరాల వర్షపాత రికార్డులను పరిశీలించారు. దర్మా లోయలో కొండచరియలు విరిగిపడే ప్రమాదాలు బలహీనమైన భూగర్భ నిర్మాణం, నిటారు వాలులు, భారీ వర్షపాతం, భూకంపం వల్ల కూడా సంభవించవచ్చని సైంటిస్టులు గుర్తించారు. అలాగే రోడ్లు, భవనాలు, నీటి మౌలిక సదుపాయాలు, వ్యవసాయ భూమి, వృక్ష సంపద, ఆనకట్టలను ప్రమాదంలో ఉన్న ఆస్తులుగా గుర్తించారు. కొండ చరియలు విరిగి పడే అవకాశం ఉన్న అధిక ప్రమాద ప్రాంతాలు ప్రధానంగా ధర్మా లోయ దక్షిణ భాగంలో ఉన్నట్లు శాస్త్రవేత్తలు వెల్లడించారు. దర్మా లోయలో రహదారి, జల విద్యుత్, పర్యాటక, నివాస ప్రాజెక్టులను రిస్క్ మ్యాప్‌లను సంప్రదించిన తర్వాత మాత్రమే ఆమోదించాలని సిఫార్సు చేశారు. ఈ అధ్యయనంలో వివిధ మెషిన్ లెర్నింగ్ నమూనాలను ఉపయోగించి దర్మా లోయలో కొండచరియలు విరిగిపడే ముప్పులకు గల అవకాశాలు, రిస్క్‌ను విశ్లేషించడం జరిగిందని వాడియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ జియాలజీకి చెందిన శాస్త్రవేత్త షవేజ్ వివరించారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
4 సెప్టెంబర్ 2026

# ఎగుమతి కేంద్రాలుగా 31 జిల్లాలు

-మొదటిపేజీ తరువాయి

దానికి సంబంధించిన సమాచారాన్ని పంపించింది. గతంలో ఒకే జిల్లా ఒకే ఉత్పత్తి స్కీమ్? ఉండగా దానిని విస్తరించి ఎగుమతి కేంద్రాల జిల్లాలు (డిస్ట్రిక్ట్ ఎక్స్‌పోర్ట్ హబ్) అనే మంటి ప్రోగ్రామ్?ను చేపట్టింది. గత జూన్‌లో ప్రారంభించిన ఈ స్కీమ్? కింద అమలు కోసం జిల్లాలు-అనువైన ఉత్పత్తుల జాబితాను కేంద్రం కోరడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆ మేరకు జిల్లాల ప్రత్యేకతలను పంపింది. హనుమకొండ, యాదాద్రి భువనగిరి మినహా మిగిలిన అన్ని జిల్లాలు ఈ పథకం కింద ఎంపిక అయ్యాయి.

ఏం చేస్తారంటే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, సంస్థలు, పరిశ్రమలను ఒకే ప్లాట్?ఫామ్?పైకి తెచ్చి ఇంటర్నేషనల్ మార్కెట్లతో అనుసంధానించడం ద్వారా ఉపాధి కల్పనకు మరింత ఉపయోగకరంగా ఊతమిచ్చేందుకు ఇది తోడ్పాటును అందించనుంది. ప్రతి జిల్లా నుంచి ప్రత్యేకమైన ఉత్పత్తులను ఎంపిక చేసి, వాటికి బ్రాండ్ గుర్తింపు కల్పించి, ఎక్స్?పోర్ట్? చేసేందుకు ప్రోత్సహిస్తారు. దీని కింద రాష్ట్రస్థాయి ఎగుమతి ప్రోత్సాహక కమిటీని ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ అధ్యక్షతన ఏర్పాటు చేస్తారు. జిల్లాలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా ఎగుమతి ప్రోత్సాహక కమిటీని ప్రారంభించి ప్రక్రియను చేపడతారు.

**జిల్లాలు ఎగుమతులకు అనువైన ఉత్పత్తులు**

ఆదిలాబాద్ : డోక్రా కళోత్పత్తులు, ఫర్నిచర్, సోయాబీన్, పత్తి
కుమురంభీం ఆసిఫాబాద్ : పత్తి, చిరుధాన్యాలు
నిర్మల్ : పసుపు, నిర్మల్ బొమ్మలు, చిత్రాలు
మంచిర్యాల : మామిడి, పత్తి
జగిత్యాల: మామిడి, పసుపు, బియ్యం, బంగారు ఆభరణాలు
కరీంనగర్ : బియ్యం, కరీంనగర్ వెండి ఫిలిగ్రీ, గ్రానైట్
పెద్దపల్లి : కలప ఫర్నిచర్, బయో ఫ్యూయల్
రాజన్న సిరిసిల్ల : చేనేత, పవర్‌లూమ్ వస్త్రాలు
జయశంకర్ భూపాలపల్లి : మిరప, చెక్క కళాకృతులు
నిజామాబాద్ : పసుపు, బియ్యం, విత్తనాలు, చక్కెర
కామారెడ్డి : ఆయిల్‌పామ్, కోడి మాంసం, కోడిగుడ్లు
వరంగల్ : చేనేత తివాచీలు, మామిడి, బియ్యం, మొక్కజొన్న, రెడీమేడ్ వస్త్రాలు
జనగామ : బియ్యం, ఇత్తడి కళాఖండాలు, పెంబర్తి లోహకళ
మహబూబాబాద్ : మామిడి, మిరప, పసుపు
ములుగు : మిర్చి పంట
ఖమ్మం : మామిడి, మిరప, గ్రానైట్, బొగ్గు
భద్రాద్రి కొత్తగూడెం : స్పాంజ్ ఐరన్, అటవీ ఉత్పత్తులు, మిర్చి
నల్గొండ : బియ్యం, పత్తి
సూర్యాపేట : పండ్లు, సిమెంట్
మహబూబ్‌నగర్ : మామిడి, జొన్న, జనరల్ ఇంజినీరింగ్, ఫ్యాబ్రికేషన్, ఖనిజాలు
నాగర్‌కర్నూల్ : మామిడి, వేరుశెనగ, రెడీమేడ్ వస్త్రాలు
నారాయణపేట : చేనేత చీరలు, వస్త్రాలు
జోగులాంబ గద్వాల : చేనేత చీరలు
వనపర్తి : మామిడి, వేరుసెనగ
హైదరాబాద్ : రత్నాలు, ఆభరణాలు, ముత్యాలు
మేడ్చల్-మల్కాజిగిరి : బయోటెక్ ఉత్పత్తులు
రంగారెడ్డి : మామిడి, బిస్కెట్లు, ఆహారశుద్ధి ఉత్పత్తులు
వికారాబాద్ : కందులు, జరీ చీరలు, ఎంబ్రాయిడరీ వస్త్రాలు
మెదక్ : దుబ్బాక వస్త్రాలు, టెక్స్‌టైల్స్, కోళ్ల దాణా
సంగారెడ్డి : మామిడి, జనరల్ ఇంజినీరింగ్ ఉత్పత్తులు, విత్తనాలు
సిద్దిపేట : పత్తి, జిన్నింగ్

# మంత్రివర్గం నుంచి కొండా సురేఖ బర్తరఫ్

-మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి లేఖ రాయడం, దానికి గవర్నర్ ఆమోదంతో పార్టీలో జరిగిన నాటకీయ పరిణామాలకు తెరపడినట్లైంది.

**పీసీసీ సీరియస్**

పరకాల టికెట్ ఆశిస్తున్న కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు.. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించేందుకు కారణమయ్యాయనే హస్తం నేతలు అంటున్నారు. పరకాల సిట్టింగ్ మీూా రేవూరి ప్రకాశ్ రెడ్డికే మళ్లీ టికెట్ ఇస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనను సుస్మిత గత నెల 19న కొండా సురేఖ పుట్టిన రోజు వేడుకల్లో బహిరంగంగా సవాల్ చేశారు. రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్‌లోని సీనియర్ నేతలపై అవినీతి ఆరోపణలు చేశారు. ఆ అంశంపై పలువురు కాంగ్రెస్ నేతలు పీసీసీకి ఫిర్యాదు చేశారు. పీసీసీ సూచన మేరకు మల్లు రవి నేతృత్వంలోని క్రమశిక్షణా కమిటీ ఆ విషయంపై దృష్టిసారించింది.

**వాదనలు, వివరణలు**

సుస్మిత వ్యాఖ్యలపై పూరిస్థాయిలో విచారణ చేయాలని మల్లు రవిని, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆదేశించగా కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. సుస్మిత వ్యాఖ్యలపై వివరణ తీసుకున్నారు. తన కుమార్తె స్వతంత్ర మహిళ అని పేర్కొన్న కొండా సురేఖ.. ఆ వ్యాఖ్యలకు తనకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఆ వ్యాఖ్యలకి తాను బాధ్యురాలిని కాదని క్రమశిక్షణా కమిటీ ముందు వివరణఇచ్చారు. తనపై అవినీతి ఆరోపణలు లేవి సురేఖ వివరణ ఇచ్చినా.. క్రమశిక్షణా కమిటీ సంతృప్తి చెందలేదు. సుస్మిత వ్యాఖ్యలు పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిందని తక్షణమే మంత్రివర్గం నుంచి తొలగించాలని ఏకగ్రీవంగా తీర్మానించి నివేదికను ఢిల్లీకి పంపింది.

**హస్తినకు చెందిన పంచాయితీ**

తరువాత దిల్లీ వేదికగా హైడ్రామా సాగింది. సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ హస్తినలో పార్టీ హైకమాండ్‌తో సమావేశమయ్యారు. పార్టీలో క్రమశిక్షణే ముఖ్యమని కఠిన చర్యలు తీసుకోకపోతే పార్టీలో తిరుగుబాట్లు పెరుగుతాయని అధిష్ఠానం పెద్దలకు నివేదించారు. దిల్లీ వెళ్లిన కొండా సురేఖ కూడా ఖర్గేను కలిసి తన వాదన వినిపించారు. తాను బీసీ సామాజికవర్గానికి చెందిన వారమని తమ కుటుంబానికి పెద్ద ఓటుబ్యాంక్ ఉందని చెప్పుకొచ్చారు. అయినా శాంతించని హైకమాండ్ రాజీనామా చేయాలని స్పష్టంచేసింది. సురేఖ అందుకు అంగీకరిచకపోవటంతో సీఎం రేవంత్ నేరుగా కొండా సురేఖను బర్తరఫ్ చేయాలని సిఫార్సు చేస్తూ గవర్నర్‌కి లేఖ పంపారు.

"నన్ను బర్తరఫ్ చేయడాన్ని ఖండిస్తున్నా. నిర్ణయానికి ముందు నా వివరణ తీసుకోవాల్సింది. నా కుమార్తె వ్యాఖ్యలకు నన్నెలా బాధ్యురాలిని చేస్తారు?. నా కుమార్తె స్వతంత్ర మహిళ ఆమె వ్యాఖ్యలు ఆమెవే" - కొండా సురేఖ

**కీలక పదవుల్లో మార్పులు**

రాష్ట్ర ప్రభుత్వం రెండు కీలక పదవుల్లో కూడా మార్పులు చేసింది. సిట్టింగ్ ఎమ్మెల్యే టి. మేఘారెడ్డిపై చేసిన వ్యాఖ్యల కారణంగా ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుండి జి.చిన్నారెడ్డిని తొలగించి, ఆ స్థానంలో హైదరాబాద్ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని నియమించారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద నియమితులయ్యారు.

## హైకమాండ్‌ను రేవంత్ రెడ్డి బ్లాక్‌మెయిల్ చేసి

# నన్ను బర్తరఫ్ చేయించారు

మంత్రివర్గం నుంచి తనను బర్తరఫ్ చేయాలన్న నిర్ణయంపై కొండా సురేఖ స్పందించారు. తనని మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయడాన్ని ఖండించారు. నిర్ణయానికి ముందు తన వివరణ తీసుకోవాల్సిందని తెలిపారు. తన కుమార్తె వ్యాఖ్యలకు తననెలా బాధ్యురాలిని చేస్తారని ప్రశ్నించారు. తన కుమార్తె స్వతంత్ర మహిళ అని, ఆమె వ్యాఖ్యలు ఆమెవేనని పేర్కొన్నారు. మీడియాకు ఇచ్చిన నోట్‌లో ఊరు, పేరు లేదు. ఉరిశిక్ష పడిన ఖైదీని కూడా చివరి కోరిక అడుగుతారన్న కొండా సురేఖ తనను మాత్రం ఏ వివరణ అడగకుండానే తొలగించారని, తనను ఇలా ఏకపక్షంగా తొలగించటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తనను తొలగించడం అధిష్ఠానానికి కూడా ఇష్టం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పట్టుబట్టి తనని బర్తరఫ్ చేయిస్తున్నారని, 'బర్తరఫ్ చేస్తారా? నన్ను వెళ్లిపోమ్మంటారా' అని అధిష్ఠానాన్ని బ్లాక్‌మెయిల్ చేశారని ఆమె ఆరోపించారు.



తన మీద, తన మాజీ ఓఎస్‌డీ మీద కుట్రలు చేస్తున్నారని, దీని వెనక వేం నరేందర్‌రెడ్డి, పొంగులేటి, కొండల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మరికొందరు ఉన్నారన్నారు. అందరూ కలిసి కావాలని కక్షగట్టి నన్ను, సుమంత్ కుటుంబాన్ని వేధించారని విమర్శించారు. సుమంత్‌పై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

"సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీపై నేను ఎలాంటి విమర్శలు చేయలేదు. ఒకప్పుడు మల్లు రవి కూడా ఒకప్పుడు కాంగ్రెస్‌ను తిట్టారు. మాజీ సీఎం రోశయ్య, జైపాల్‌రెడ్డి కూడా ఇందిరాగాంధీని తిట్టారు. నా కుమార్తె వ్యాఖ్యలకు నాపై చర్యలు తీసుకోవటం బాధాకరం. రూ.50 కోట్లు ఇచ్చి పీసీసీ పదవి తెచ్చుకున్నారని తిట్టినవారికి పదువులు ఇచ్చారు. నన్ను తొలగించినందుకు ఏమీ బాధపడటం లేదు. కారణం చెప్పకుండా తొలగించడమే చాలా బాధాకరం. బీసీ మహిళను ఇలా అవమానకరంగా తొలగించటం బాధాకరం. కారణం చెప్పకుండా తొలగించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నా. కారణం చెప్పాల్సిన బాధ్యత సీఎం, ఏఐసీసీపై ఉంది" - కొండా సురేఖ

మంత్రిగా తనకు ఎలాంటి అధికారాలు లేకుండా చేశారని, తన ప్రమేయం లేకుండానే తన శాఖలో నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించారు. తనకు తెలియకుండా తన ఓఎస్‌డీ సుమంత్‌ను తప్పించారని, అభివృద్ధి విషయంలో తన నియోజకవర్గంపై వివక్ష చూపారని విమర్శించారు. తన శాఖలోని అంశాలపై కడియం శ్రీహరి జోక్యం చేసుకున్నారని, తన శాఖలోని అధికారులతో కడియం సమీక్షలు నిర్వహించారని తెలిపారు.

**ప్రజల్లో వ్యతిరేకత ఉంది**

మంత్రులందరూ సంతోషంగా ఉన్నారా గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పాలని సురేఖ కోరారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరూ సంతోషంగా లేరనే విషయం అందరికీ తెలుసనని తెలిపారు. ఇప్పటికైనా అందరూ బయటికి వచ్చి ధైర్యంగా మాట్లాడాలని సూచించారు. ప్రజలకు సేవ, అభివృద్ధి చేయలేకపోతున్నామనే బాధ అందరిలో ఉందని, పనుల జరగాలంటే ఎవరివద్దకు వెళ్లాలో తెలియని స్థితిలో ఎమ్మెల్యేలు ఉన్నారని ఆరోపించారు. ఇస్తామన్న హామీలు నెరవేర్చకపోవటం వల్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందని స్పష్టం చేశారు.

**ఎమ్మెల్యేగా కొనసాగుతా**

క్షేత్రస్థాయి పరిస్థితిపై ప్రభుత్వం సర్వే చేయించుకుంటే మంచిదని సూచించారు. తాను పునరాలోచించుకోమని చెప్పనని, పార్టీ తీరు మారాల్సిన అవసరం ఉందని తెలిపారు. మళ్లీ కాంగ్రెస్ పార్టీ గెలవాలంటే చాలా మార్పులు చేసుకోవాలని, రేవంత్ రెడ్డి ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదని హితువు పలికారు. తనవైపు ఒక వేలు చూపితే రేవంత్‌రెడ్డి వైపు నాలుగువేళ్లు చూపుతాయని ఎద్దేవా చేశారు. ప్లాన్-బిపై ఇంకా ఏమీ ఆలోచించుకోలేదనిఎమ్మెల్యేగా కొనసాగుతానని, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసే ఆలోచన లేదని స్పష్టం చేశారు.

**ఇంకా ఆలోచించుకోలేదు**

తన కుమార్తె వ్యాఖ్యలను తాను ఖండించాల్సిన అవసరం లేదన్న సురేఖ తన కుమార్తె వ్యక్తిగత అభిప్రాయాన్ని తప్పుపట్టే అధికారం తనకు లేదని స్పష్టం చేశారు. అధిష్ఠానానికి తాను ఇచ్చిన లేఖను మీడియాకు ఇస్తున్నానని, భవిష్యత్ కార్యాచరణపై ఇంకా ఆలోచించుకోలేదని తెలిపారు. జగ్గారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై ఏం నిర్ణయం తీసుకున్నారని ఆమె నిలదీశారు. తాను తప్పు చేయలేదని, తనకు పశ్చాత్తాపం లేదని కొండా సురేఖ వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. వైఎస్ఆర్ తర్వాత రేవంత్ రెడ్డినే ఎక్కువ అభిమానించానని, రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడు, సీఎం కావాలని తానే ముందు కోరుకున్నానని పేర్కొన్నారు.

**సంతోషంగా ఉంది**

తనపై కక్షపూరితంగా చర్యలు తీసుకున్నారని భావిస్తున్నానన్న కొండా సురేఖ తన వల్ల ముగ్గురు బీసీ మహిళలకు పదవులు రావటం సంతోషకరమని తెలిపారు. తన కోసం చిన్నారెడ్డిపై వేటు వేయటం సరికాదని అభిప్రాయపడ్డారు. "నన్ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయడాన్ని ఖండిస్తున్నా. రాజీనామా చేయమని నన్నెవరూ అడగలేదు. నా వివరణ వినకుండా నేరుగా తొలగించటం సరికాదు. నిర్ణయానికి ముందు నా వివరణ తీసుకోవాల్సింది. నా కుమార్తె వ్యాఖ్యలకు నన్నెలా బాధ్యురాలిని చేస్తారు?. నేను తప్పు చేయలేదు. నాకు పశ్చాత్తాపం లేదు. సీఎం రేవంత్ రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలి. వైఎస్ఆర్ తర్వాత రేవంత్‌రెడ్డినే ఎక్కువ అభిమానించాను. రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడు, సీఎం కావాలని నేనే ముందు కోరుకున్నా. నాపై కక్షపూరితంగా చర్యలు తీసుకున్నారని భావిస్తున్నా. భవిష్యత్ కార్యాచరణపై ఇంకా ఆలోచించుకోలేదు. నా వల్ల ముగ్గురు బీసీ మహిళలకు పదవులు రావటం సంతోషకరం. నా కోసం చిన్నారెడ్డిపై వేటు వేయటం సరికాదు"

## అభివృద్ధిని అడ్డుకుంటున్నారు

-మొదటిపేజీ తరువాయి

పేరు చాలా దేశాల్లో సుపరిచితమన్న రేవంత్ రెడ్డి పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఎప్పుడూ తన గళం వినిపిస్తూనే ఉంటారని పేర్కొన్నారు. తన ప్రాంత అభివృద్ధి కోసం ప్రభుత్వంతో పోరాటానికైనా సిద్ధంగా ఉంటారని కొనియాడారు. మీరాలం ట్యాంక్‌పై రూ.500 కోట్లతో కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తున్నామని, మీరాలం కేబుల్ బ్రిడ్జి పూర్తైతే రవాణాపరంగా, పర్యాటకంగా ప్రయోజనమని, ఇప్పటికే ఆరాంఘర్, మూసారాంబాగ్ వంతెనల నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. పాతబస్తీ మెట్రోను పూర్తి చేస్తామని చెప్పామని, చేసి చూపిస్తామని, నాలాలపై ఆక్రమణలు తొలగిస్తామని, మురుగు సమస్య లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. ఎక్కడైనా పేదల ఇళ్లు తొలగిస్తే ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

"మీరాలం ట్యాంక్‌పై రూ.500 కోట్లతో కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తున్నాం. మీరాలం కేబుల్ బ్రిడ్జి పూర్తయితే.. రవాణాపరంగా, పర్యాటకంగా ప్రయోజనం. ఇప్పటికే ఆరాంఘర్, మూసారాంబాగ్ వంతెనల నిర్మాణం పూర్తి చేశాం. పాతబస్తీ మెట్రోను పూర్తి చేస్తామని చెప్పాం చేసి చూపిస్తాం. నాలాలపై ఆక్రమణలు తొలగిస్తాం. మురుగు సమస్య లేకుండా చేస్తాం. ఎక్కడైనా పేదల ఇళ్లు తొలగిస్తే ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి ఆదుకుంటాం. కొన్ని శతాబ్ధాలుగా ఈ నగరంలో హిందూ- ముస్లింలు కలిసి జీవిస్తున్నారు. హిందూ-ముస్లింల సమిష్టి కృషితోనే ఈ నగరం అభివృద్ధి చెందుతూ వస్తోంది" - రేవంత్ రెడ్డి, సీఎం

**గుజరాత్‌కు గులాంగిరీ చేస్తున్నారు**

కొన్ని శతాబ్ధాలుగా ఈ నగరంలో హిందూ- ముస్లింలు కలిసి జీవిస్తున్నారని, హిందూ-ముస్లింల సమిష్టి కృషితోనే ఈ నగరం అభివృద్ధి చెందుతూ వస్తోందని, మూసీ పునరుజ్జీవనం చేపడితే బీజేపీ నేతలు తప్పు పడుతున్నారని వెల్లడించారు. యూపీలో గంగానది, గుజరాత్‌లో సబర్మతి నది ప్రక్షాళన చేపట్టాలేదా?, గంగా, సబర్మతి ప్రాజెక్టులను ప్రశంసించిన నేతలు మూసీ ప్రక్షాళనను ఎందుకు తప్పుపడుతున్నారు నిలదీశారు. రాష్ట్ర బీజేపీ నేతలు గుజరాత్‌కు గులాంగిరీ చేస్తున్నారని విమర్శించారు.

**అభివృద్ధిని అడ్డుకుంటున్నారు**

తననెవవరూ బెదిరించవద్దని, బెదిరిస్తే భయపడనని అన్నారు. స్నేహంతో మాత్రమే తనని గెలవగలరని హితువు పలికారు. తాను ఎవరికీ గులామ్‌ను కాదని దోస్తీకి మాత్రమే గులామ్‌నని సూచించారు. స్నేహం కోసం ఏదైనా చేసే వ్యక్తిని తానని, ఎన్నికలు వస్తుంటాయి పోతుంటాయి గెలుపోటములు సహజమని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

**ఒవైసీ హాట్ కామెంట్స్**

ఇదే కార్యక్రమంలో పాల్గొన్న అసదుద్దీన్ ఒవైసీ కీలక వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ఉన్నందుకే తాము కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో మద్దతు ఇస్తున్నామని ప్రకటించారు. రేవంత్ రెడ్డిని ఆయన స్టైల్?లోనే పరిపాలన చేయాలని ఒవైసీ సూచించారు. ఇంకా ప్రజల్లోకి రావాలని ఆయన కోరారు. రేవంత్ పాలనలో హైదరాబాద్, తెలంగాణ అభివృద్ధి చెందాలని కోరారు.

**30 నిమిషాల సమయం ఆదా**

చంచల్‌గూడ-సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్ ప్రారంభంతో చంచల్ గూడ, సైదాబాద్, ఐఎస్ సదన్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గనున్నాయి. 30 నిమిషాల వరకు ప్రయాణ సమయం ఆదా అవుతుంది. మొత్తం 3.3 కి.మీ. పొడవురూ.620 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ స్టీల్ ఫ్లైఓవర్ నిర్మాణంతో నల్గొండ ఎక్స్ రోడ్ నుంచి ఒవైసీ ఆస్పత్రి వరకు ఆటంకం లేకుండా ప్రయాణించవచ్చు.

## రైతుల కోసం పాదయాత్ర చేస్తా

-మొదటిపేజీ తరువాయి

మేరకు కేటీఆర్ మాట్లాడుతూ.. మిర్యాలగూడలో రైతు ధర్నాను అడ్డుకునేందుకు కుట్ర చేశారని ఆరోపించారు. 'పచ్చని పొలాలతో ఉన్న మిర్యాలగూడ ప్రాంతంలో రైతు మహా ధర్నా ఎందుకు పెట్టాల్సి వచ్చిందో ఆలోచించుకోవాలి. కళ్ల ముందే పంటలు ఎండిపోతున్నాయి. రైతు డిక్లరేషన్ పేరుతో రాహుల్ ఇచ్చిన హామీ ఏమైంది?, రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా రూ. 15 వేలు ఏమైంది?, రైతు బంధు, రైతు బీమా ఎగ్గొట్టింది ఎవరు?, పంటలకు నీళ్లు ఇవ్వమంటే బీఆర్ఎస్ వాళ్ల రక్తం చల్లుతానని రేవంత్ అంటున్నారు.

కౌలు రైతులకు రైతుబంధు, వరి, పత్తికి క్వింటాల్‌కు రూ.500 బోనస్, రూ.2,500 మద్దతు ధర ఇస్తామని ప్రకటించారని తెలిపారు. 2022లో వరంగల్‌లో నిర్వహించిన రైతు డిక్లరేషన్‌లో కాంగ్రెస్ చెప్పిన హామీలను ధర్నాలో ప్రదర్శించారు. కేసీఆర్ అప్పట్లో కాంగ్రెస్‌ను నమ్మితే గోస పడతారని చెప్పారని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే యూరియా కోసం చెప్పులు లైన్లో పెట్టే రోజు వస్తుందని హెచ్చరించారని వెల్లడించారు. కేసీఆర్ ప్రభుత్వంలో యూరియా కావాలంటే పొలం దగ్గరకే వచ్చేదని, ఇప్పుడు యూరియా దొరకని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కాంగ్రెస్ వస్తే రైతుబంధుకు రాంరాం, దళితబంధు పోతుందని కేసీఆర్ చెప్పిన మాటలు నిజమవుతున్నాయని వ్యాఖ్యానించారు .

సాగర్‌లో నీళ్లు ఉన్నా పంటలకు నీళ్లు ఇవ్వాలనే సోయి జిల్లాలో ఉన్న మంత్రులకు లేదు. ఉత్తమ్ నీళ్ల మంత్రి కాదు. రైతుల కళ్లలో నీళ్లు నింపుతున్న మంత్రి. ఎంతటి కరువు పరిస్థితి ఉన్నా గతంలో రెండు పంటలకు నీళ్లు ఇచ్చాం. నీకు ఓట్లేయడమే ఎడమ కాలువ రైతులు చేసిన తప్పా. ఓటేసిన పాపానికి రైతాంగానికి అన్యాయం చేస్తోంది. రైతులకు యూరియా కూడా దొరకడం లేదు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మీసం మెలేసిన కొండా మురళి!

**రాజకీయంలో ఉన్నది ఉన్నట్టు మాట్లాడితే ఎవరూ తట్టుకోరు**

**పదవులు ఉన్నా... లేకున్నా మా గౌరవం మాకు ఎప్పుడూ ఉంటుంది**

**దేనికీ భయపడం : మురళి ట్వీట్**



హైదరాబాద్ : మంత్రివర్గం నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేసిన నేపథ్యంలో ఆమె భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి మీసం మెలేయడం చర్చనీయాంశంగా మారింది. బర్తరఫ్ వార్త వెలువడిన వెంటనే గురువారం హైదరాబాద్‌లోని తమ నివాసానికి పెద్దఎత్తున చేరుకున్న మీడియా ప్రతినిధులు, కార్యకర్తలు, అనుచరుల ముందుకు వచ్చిన మురళి.. చిరునవ్వుతో కనిపించారు. మొదటి అంతస్తు బాలనీలోకి వచ్చిన మురళి.. అందరూ చూస్తుండగానే మీసం మెలేసి, ఇక వెనక్కి తగ్గేది లేదన్న సంకేతాలిచ్చారు. కొండా మురళి చేసిన ఈ సంజ్ఞకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. రాజకీయంగా కక్షపూరిత చర్యలు చేపట్టినా తాము భయపడబోమని, తమ వర్గం బలం ఏందో నిరూపిస్తామన్న రీతిలో ఆయన వ్యవహరించారని విశ్లేషకులు భావిస్తున్నారు. భవిష్యత్తు రాజకీయ పోరాటాన్ని ఎదురొనేందుకు సిద్ధమనే సంకేతాలిచ్చారని చెప్తున్నారు.

**అన్ని దరిద్రాలు ఒక్కటై మాపై కుట్ర**

అన్ని దరిద్రాలు ఒక్కటై తమపై కుట్రపూరితంగా రాజకీయ దాడులు చేశాయని, కానీ తాము దేనికీ భయపడేది లేదని కొండా మురళి పేర్కొన్నారు. సురేఖను మంత్రివర్గం నుంచి బర్ఫ్ చేసిన అనంతరం ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. 'ఉన్నది ఉన్నట్టు మాట్లాడితే ఎవరూ తట్టుకోరు. ఈరోజు మేం ఎదుర్కొంటున్న పరిస్థితులు.. రేపు ఇంకెవరికి ఎదురవుతాయో' అని వ్యాఖ్యానించారు. 'మాకు పదవులు ఉన్నా లేకపోయినా, మా గౌరవం మాకు ఎప్పుడూ ఉంటుంది. ప్రతి విషయానికీ మేం వెంటనే స్పందించకపోవచ్చు. కానీ, జరుగుతున్న ప్రతి ఒక్క పరిణామాన్నీ లోతుగా గమనిస్తూనే ఉంటాం' అని పేర్కొన్నారు. ఎంతటి కష్టాన్నైనా తట్టుకుంటాం. మొండిగా ఎదురెళ్తామని వ్యాఖ్యానించారు. మురళి వ్యాఖ్యలు కొత్త చర్చకు తెరలేపాయి.

## సంపాదకీయం

# జెన్ జీ నిజంగా అన్ ఫిట్టా..

సమాజంలో ఉద్యోగం, వ్యాపారం చేయడం ఎంత ముఖ్యమో.. మనుషులతో సంబంధాలు నెలకొల్పడం అంతే ముఖ్యం. మనుషుల మధ్య కమ్యూనికేషన్ ఉంటేనే కెరీర్లో ఎదగడం లేదా వ్యాపారంలో రాణించడం జరుగుతుంది. అయితే కొన్ని నివేదికల ప్రకారం ప్రస్తుతం ఉన్న జెన్ జీ గా పిలిచే యువతలో కమ్యూనికేషన్స్ స్కిల్స్ చాలా తక్కువగా ఉన్నాయని.. దీంతో ఇది వీరికి అడ్డంకిగా మారుతుందని ప్రముఖ సంస్థ లింక్డ్ ఇన్ తెలిపింది. దీంతో యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొంది. ఈ నివేదిక గురించి పూర్తి వివరాల్లోకి వెళ్తే..ప్రముఖ కమ్యూనికేషన్స్ సంస్థ లింక్డ్ ఇన్ తెలిపిన వివరాల ప్రకారం భారతదేశంలో సుమారు 83 శాతం మంది జెన్ జడ్ యువత నెట్వర్కింగ్ చేయడంలో వెనుకబడి ఉన్నట్లు తెలిపింది. నెట్వర్కింగ్ అంటే చాలామంది కేవలం ఉద్యోగం కోసం ఇతరులను పరిచయం చేసుకోవడమే అని అనుకుంటున్నారు. కానీ వారి జీవిత విశేషాలను ఇతరులతో పంచుకోవడం.. కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడం .. కెరీర్ కు సంబంధించిన విషయాలను అడగడం.. ఇతరులకు చెప్పడం వంటివి ఉంటాయి.అయితే ఈ విషయాలను ఇతరులతో పంచుకోవడంలో ఇప్పుడున్న యువతలో మొహమాటం ఎక్కువగా ఉన్నట్లు లింక్డ్ ఇన్ సంస్థ తెలిపింది. దీంతో యువత ఇతరులు ఏమనుకుంటారో నన్న భయం ఎక్కువగా కలిగి ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కెరీర్ ప్రారంభ విషయంలో యువత సీనియర్లను ఏదైనా విషయాలను అడగాలంటే చాలా భయపడిపోతున్నారు. అంతేకాకుండా తాము ఏదైనా మాట్లాడితే తిరస్కరిస్తారేమోనని.. తమ ఆలోచన ఇతరికి నచ్చదేమోనన్న మొహమాటంతో ఉన్నట్లు తెలుపుతున్నారు.లింక్డ్ ఇన్ తెలిపిన మరో విషయం ఏమిటంటే.. యువతలో 79 శాతం తమ కెరీర్ నెట్వర్క్ ప్రాముఖ్యత గుర్తిస్తున్నప్పటికీ.. 52 శాతం మందికి అసలు నెట్వర్కింగ్ ను ఎలా ప్రారంభించాలో తెలియడం లేదని తెలిపింది. ఇందులో భాగంగా ఇతరులతో ఎలా మాట్లాడాలి? మొదటి మెసేజ్ ఎలా పంపాలి? తమ గురించి ఎలా పరిచయం చేసుకోవాలి? అనే విషయాలను ఇతరులతో పంచుకోవడం లేదు.అయితే కొందరు నిపుణులు తెలుపుతున్న ప్రకారం నెట్వర్కింగ్ అంటే ఒకేరోజు వందల మందిని పరిచయం చేసుకోవడం కాదు.. ముందుగా తమ రంగానికి సంబంధించి ఒకరితో పరిచయం ఏర్పడి ఆ తర్వాత నెట్వర్క్ పెంచుకొని అవసరం ఉంటుందని తెలుపుతున్నారు. తమ ప్రొఫెషనల్ స్పేస్ ఇతరులను ప్రశ్నలు అడగడం.. కొత్త పరిచయాలు చేసుకోవడం వల్ల సమాజంలో అవగాహన కలుగుతుందని అంటున్నారు. అయితే నేరుగా ఇతరులతో మాట్లాడే ఇష్టం లేకపోతే సోషల్ మీడియా ప్లాట్ఫారం ద్వారా కూడా పరిచయం చేసుకోవచ్చని తెలుపుతున్నారు.యువతలో నెట్వర్కింగ్ సమస్య ఉంటే భారీగా అవకాశాలు కోల్పోయే అవకాశం ఉందని లింకుడ్ ఇన్ సంస్థ తెలుపుతుంది. కొన్నిసార్లు కేవలం ఆన్లైన్ ద్వారా మాత్రమే కాకుండా మనకు తెలిసిన వ్యక్తుల ద్వారా కూడా అవకాశాలు పొందే అవకాశం ఉంటుందని.. ఈ నేపథ్యంలో పరిచయాలు ఎంతో ముఖ్యమని అంటున్నారు. అంతేకాకుండా తమకు ఉన్న నైపుణ్యాలను ఇతరులకు తెలపాలంటే నెట్వర్కింగ్ ఎంతో అవసరమని చెబుతున్నారు. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ కాలేజెస్ అండ్ ఎంప్లాయర్స్ ఇతర మానవ వనరుల సర్వేల్లోని తాజా గణాంకాలు కొత్త గ్రాడ్యుయేట్ల పనితీరుపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఔంఅఇ అంటే నేషనల్ అసోసియేషన్ ఆఫ్ కాలేజెస్ అండ్ ఎంప్లాయర్స్ అని చెప్పాలి. ఇది అమెరికాలోని ఒక ప్రముఖ ప్రొఫెషనల్ లాభాపేక్షలేని సంస్థ, ఇది ఉన్నత విద్య మరియు కార్పొరేట్ ప్రపంచం మధ్య ఒక వంతెనలా పనిచేస్తుంది. 71.2 శాతం కంపెనీలు కొత్త గ్రాడ్యుయేట్లు ఉద్యోగానికి కేవలం కొంతమేరకు సిద్ధంగా ఉన్నారని గుర్తించాయి. కేవలం 21.6% కంపెనీలు జెన్ జీలను జాబ్ చేయడానికి సిద్ధంగా ఉన్నారని భావించాయి. 7.2% ఎంప్లాయర్లు వారు అసలు సిద్ధంగానే లేరని అభిప్రాయపడ్డారు.: ఇటీవల నియమితులైన కొత్త గ్రాడ్యుయేట్ల ఆన్-జాబ్ పనితీరు అత్యంత సంతృప్తికరంగా లేదు అని 75 శాతం కంపెనీలు అంగీకరించాయి. 800 మందికి పైగా ఊఖీ అధికారులపై జరిగిన మరో సర్వేలో 37 శాతం అధికారులు, కొత్త గ్రాడ్యుయేట్కు ఉద్యోగం ఇవ్వడం కంటే రోబోట్ లేదా ఎఐ టెక్నాలజీతో పని చేసుకోవడం మంచిదని చెప్పారు.కరోనా వ్యాప్తి సమయంలో సంవత్సరాల పాటు స్కూల్స్, కాలేజీలు మూసేశారు. ఈ సమయంలో అధిక స్క్రీన్ టైమ్, మనుషుల నుంచి దూరం పాటించడం, వర్క్ ఫ్రం హోమ్ లేదా ఆన్లైన్ క్లాసుల వాతావరణం కొనసాగింది. దాంతో యువతలో ముఖాముఖి సంభాషణ, పరస్పర సమన్వయం లేకపోవడంతో, వీరిలో ఆఫీస్ నార్మ్స్ లో భారీ లోపం కనిపిస్తోంది.కొత్త విద్యార్థులు కమ్యూనికేట్ చేయడంలో, నిజ జీవిత సమస్యలను ఎదుర్కొనడంలో గత తరాల కంటే చాలా వెనుకబడుతున్నారని న్యూయార్క్ యూనివర్సిటీకి చెందిన సైకాలజీ ప్రొఫెసర్ టెస్సా వెస్ట్ అన్నారు. ఇప్పుడు ఈ లోపాలను సరిచేసి, వారిని ప్రవర్తనా నైపుణ్యాలు మెరుగుపరిచే బాధ్యత విద్యాసంస్థలపై పడింది.ఈ పెరుగుతున్న స్కిల్స్ గ్యాప్ను తగ్గించి, యువతను వర్క్ ప్లేస్కు అనుగుణంగా మార్చేందుకు నిపుణులు అనేక ముఖ్య సూచనలు చేశారు ప్రొఫెసర్ టెస్సా వెస్ట్ ప్రకారం, టెక్నికల్ స్కిల్స్ సులభంగా నేర్పించవచ్చు. కానీ మాట్లాడటం, చర్చించడం, అభిప్రాయ భేదాలను తెలపడం, టీమ్తో కలిసి పనిచేయడం నేర్చుకోవడానికి ఎక్కువ సమయం పడుతుంది. అందువల్ల విద్యాసంస్థలు సాఫ్ట్ స్కిల్స్పై ఫోకస్ చేయక తప్పదు. యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా ప్రొఫెసర్ పీటర్ కాపెల్లీ మాట్లాడుతూ.. ఈ సమస్యకు కేవలం కాలేజీలు, విద్యా సంస్థలనే బాధ్యులుగా చేయడం సరికాదు. కంపెనీలు కూడా ఎంట్రీ లెవల్ ఉద్యోగుల శిక్షణ, మెంటార్షిప్పై ఫోకస్ చేయడం లేదు. 2000ల తర్వాత నుంచి కొత్త ఉద్యోగులకు ఇచ్చే శిక్షణ గంటలు నిరంతరం తగ్గుతూ వస్తున్నాయని తెలిపారు.

# రాజకీయ స్వరం మారుతున్నది



ఎన్నికలు ఏవైనా..విజయం సాధించేందుకు అర్థబలం, అంగబలం, మతం, కులం ప్రధాన ఆయుధాలుగా ఉపయోగపడుతున్నాయి. ప్రజాస్వామ్య విజయానికి నాలుగు స్తంభాల విషయం ఎలా ఉన్నా, ఎన్నికల్లో విజయానికి ఈ నాలుగు బలాలు తప్పనిసరి. అది ఇప్పటివరకు ఉన్న లెక్క. కానీ ఢిల్లీలో జంతర్ మంతర్ ఉద్యమం తర్వాత ఈ లెక్క మారడం కనిపిస్తున్నది. ఈ మార్పు చాలా వేగంగా ఉండకపోవచ్చు. కానీ మార్పు ప్రారంభం కావడం ప్రజాస్వామ్యానికి మంచిది. బిహార్లో ఒకే ఒక్కడు (ప్రశాంత్ కిశోర్) చూపిస్తున్న ప్రభావం, ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే తెలంగాణలో అధికార పక్షం ఓటమి, బీఆర్ఎస్ విజయం అని చెప్తున్న పలు సర్వేలు, ఇండి యా టుడే దేశవ్యాప్తంగా జరిపిన సర్వే, బడిపిల్లలు విద్యావ్యవస్థ మెరుగు కోసం జరుపుతున్న ఆందోళనలు ఇవన్నీ చూస్తుంటే రాజకీయ స్వరం మెల్లగా మారుతున్నదనే అభిప్రాయం కలుగుతున్నది. మౌలిక సమస్యలు రాజకీయాల్లో ప్రధాన అంశాలు కావు అని నిరాశ ఆవహించిన సమయంలో యువతరం దేశ రాజకీయాల్లో పెద్ద కుదుపు తీసుకువచ్చారు. ఈ దేశం రాజకీయ నాయకుల వ్యాపార కేంద్రం కాదు.. మనందరిది అని తెలియజేశారు. సమకాలీన దేశ రాజకీయాలను జంతర్ మంతర్కు ముందు, తర్వాత అని విడదీసి చూసే పరిస్థితి. స్తబ్దుగా ఉన్న దేశ రాజకీయాల్లో యువత తీసుకువచ్చిన కదలిక సాధారణమైనది కాదు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఒక్క బీజేపీపైనే కాదు.. దేశంలోని అన్ని రాజకీయ పక్షాల మీద ఈ ప్రభావం కనిపిస్తున్నది. దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చ సాగితే అది కేంద్రంలో 12 ఏండ్ల నుంచి అధికారంలో ఉన్న బీజేపీకి ఇబ్బందికరం. అందుకే పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, నిర్వీర్యం అవుతున్న విద్యారంగం వంటి వాటిపై చర్చలు జరిగితే బీజేపీ సమాధానం చెప్పాల్సి ఉంటుంది. అందుకే ఆ పార్టీ ఇలాంటి అంశాలపై చర్చను కోరుకోదు.

అయితే ఈసారి మాత్రం బీజేపీ ఎజెండాను నిర్ణయించలేక పోతున్నది. ఎజెండాను ప్రజలు నిర్ణయిస్తున్నారు. యువత నిర్ణయిస్తున్నది. చివరకు బడిపిల్లలు కూడా నిర్ణయిస్తున్నారు. దేశంలో ఎంతోకాలం నుంచి నిరుద్యోగం, ధరలు ప్రజలను భయపెడుతున్నాయి. నిరుద్యోగులకు ఉద్యోగం లేదనే బాధ అయితే, ప్రైవేట్ రంగంలో ఉద్యోగం చేస్తున్న యువత తమ ఉద్యోగం ఉంటుందో ఊడుతుందోననే భయంతో బతుకుతున్నారు. తెలంగాణలో కల్వకుంట్ల తారక రామారావు, బిహార్లో ప్రశాంత్ కిశోర్ లాంటి వాళ్లు, దేశంలో రాహుల్ గాంధీ యువతకు చేరువవుతూ వారి ఆకాంక్షల మీద, వారు ఎదుర్కొంటున్న సమస్యల మీద దృష్టి పెడుతున్నారు. కానీ బీజేపీ మాత్రం వందేమాతరం వంటి అంశాల ద్వారా యువతలో చీలిక తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నది. వందేమాతరం ప్రయోగం బీజేపీ ఆశించిన ఫలితాన్ని చూపలేదు. అయోధ్య రామాలయాన్ని ప్రారంభించిన తీరు, హుండీలో వందల కోట్ల రూపాయల చోరీతో ఓట్ల కోసమే తప్ప నిజంగా మతం మీద గౌరవం లేదనిపిస్తున్నది. ప్రజల్లోనే కాదు, అధికారుల్లో సైతం మార్పు కనిపిస్తున్నది. బిహార్లోని బాంకీపుర్ అసెంబ్లీ స్థానానికి ఇటీవల జరిగిన ఉపఎన్నికలో ప్రశాంత్ కిశోర్ విజయం సాధించారు. ఎన్నికల్లో విజయానికి అంగబలం, అర్థబలం, కులం, మతం అనివార్యం కాదని నిరూపించిన విజయం ఇది. ఒక్కరు గెలిచి సాధించేదేంది? అనిపించవచ్చు. కానీ బిహార్లో ఒకే ఒక్కడు సాధించి చూపించాడు. విజయం సాధించిన తర్వాత ఊరేగింపులు, విజయోత్సవాలేమీ లేవు. నేరుగా కార్యరంగంలోకి దిగడమే. విజయం సాధించాక ఇటీవల పీకే తన నియోజకవర్గంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆ సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, మూడు విభాగాల కార్యదర్శులు హాజరయ్యారు. విషయ పరిజ్ఞానం ఉంటే ఇలా ఉంటుందని ప్రశాంత్ కిశోర్ చూపిస్తున్నారు. ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి దొంగ సర్టిఫికెట్ల చదువు మీద పీకే రోజూ ఆరోపణలు చేస్తున్నారు. సీఎం ఎక్కడికి వెళ్లినా అన్ పఢ్ సీఎం (చదువు రాని సీఎం) అని యువకులు నినాదాలు చేస్తున్నారు. అధికారపక్షం, ప్రతిపక్షం ఇద్దరి మీదా పీకే ఒత్తిడి తీసుకురాగలుగుతున్నారు. పీకే విజయం చదువుకున్నవారు కూడా రాజకీయాల్లోకి రావచ్చుననే సందేశం ఇస్తున్నది. తన నియోజకవర్గంలో పది వేల మందికి ఉద్యోగాలు ఇప్పించి చూపిస్తానని సవాల్ చేసి ఆ దిశగా ఇపుడు అడుగులు వేస్తున్నారు. పనిచేయకపోతే ప్రజలు ఓడిస్తారనే భయం లేనంతవరకు బిహార్ బాగుపడదని ఆయన అంటున్నారు. ఇప్పుడు పీకే పనితీరు రాష్ట్రంలోని మిగిలిన ఎమ్మెల్యేలను సైతం భయపెడుతున్నది. ఇది ఒక్క బిహార్లోనే కాదు.. దేశమంతటా అవసరం. బూతులతో, కులం, మతం బలంతో గెలుస్తామని విర్రవీగే నేతలందరికీ పనిచేయకపోతే ప్రజలు ఓడిస్తారనే భయం ఉండాలి.

# విస్తరణ చాలదు... బలపడాలి!



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దూకుడుతో అన్ని దేశాలూ కొత్త కొత్త దారులు వెదుక్కుంటున్నాయి. ఉన్న కూటములు విస్తరిస్తున్నాయి. సైనిక సహకార ఒప్పందాలు పుట్టుకొస్తున్నాయి. మంగళవారం ముగిసిన రెండు రోజుల షాంఘై సహకార సంస్థ (ఎస్సీఓ) శిఖరాగ్ర సమావేశాలు దీన్నే నిరూపించాయి. 2001లో అయిదు సభ్యదేశాలతో మొదలైన ఆ సంస్థ 2017లో మనదేశంతోపాటు పాకిస్తాన్ను కూడా చేర్చుకోగా... 2023లో ఇరాన్, ఆ మరుసటి ఏడాది బెలారస్ కూడా సంస్థలోకి ప్రవేశించాయి. ఈసారి తుర్కియే, అజర్బైజాన్, ఆర్మేనియా, మంగోలియా, లావోస్, టోగో, నేపాల్, మాల్దీవులు, బహ్రెయిన్, శ్రీలంక తదితర 14 దేశాలు 'సంభాషణ భాగస్వాములు'గా ఇందులో పాలుపంచుకున్నాయి. ఎస్సీఓ పాతికేళ్ల ప్రస్థానాన్ని జాగ్రత్తగా గమనిస్తే అది క్రమేపీ రష్యా పరిధినుంచి చైనా పరిధిలోకి జారుకుంటున్నదన్న అభిప్రాయం కలుగుతుంది.

ఇప్పటికైతే మధ్య ఆసియాలోని పూర్వపు సోవియెట్ ప్రాంతాలైన కజఖ్స్తాన్, కిర్గిస్తాన్, తజికిస్తాన్, తుర్కుమెనిస్తాన్, ఉజ్బెకిస్తాన్లు భద్రత, సంస్కృతి, సంస్థాగత, వ్యూహాత్మక అంశాల్లో ఇంకా రష్యాకు సాన్నిహిత్యంగానే ఉన్నాయి. అది కొనసాగుతుంది కూడా. కానీ మరోపక్క ఈ దేశాల్లో చైనా ఆర్థిక ప్రాబల్యం పెరుగుతోంది. అది ఈసారి సమావేశాల్లో బాహాటంగానే కనబడింది. చైనాను పశ్చిమాసియా, యూరప్, పశ్చిమాసియాలతో అనుసంధానించే బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్(బీఆర్ఐ) బృహత్తర ప్రాజెక్టు ద్వారా వచ్చే రోడ్లు, రైల్వేలు, పైప్లైన్లు, పోర్టులు వగైరాలు తమ ప్రాంత ఆర్థిక చిత్రాన్ని సమూలంగా మార్చేస్తాయని ఆ దేశాలు భావిస్తున్నాయి. చైనా వీటికి ఆయుధ సామగ్రి విక్రయాన్ని కూడా మొదలెట్టింది. అసలే ఆర్థికంగా అంతంత మాత్రంగా ఉండే రష్యా ఉక్రెయిన్తో యుద్ధానికి దిగి మరింత నష్టపోయింది. ఈ దశలో చైనాతో భాగస్వామ్యం కలిసొస్తుందని పూర్వపు సోవియెట్ దేశాలు భావించటంలో వింతేమీ లేదు. ఇప్పుడున్న అంతర్జాతీయ పరిస్థితుల్లో ఈ విషయంలో చైనాతో విభేదించే ఓపిక, తీరిక రష్యాకు లేవు. అందుకే ఈ పరిణామాలను మౌనంగా వీక్షిస్తోంది.

ఈ నేపథ్యంలో మన దేశం కూడా ఆచితూచి అడుగేయటం అవసరం. ప్రధాని నరేంద్ర మోదీ సెక్యూరిటీ (భద్రత), కనెక్టివిటీ (అనుసంధానం), ఆపర్చ్యునిటీ (అవకాశం) అనే మూడుస్తంభాలుగా ఎస్సీఓ దేశాలమధ్య సహకారం పటిష్టపడాలనీ... అది కొలవగలిగే ఫలితాల సాధన దిశగా ఉండాలనీ సదస్సులో పిలుపునివ్వటం గమనించదగింది. చైనా మాదిరే ఆ సంస్థ ఛత్రఛాయలో మనం కూడా ఎదగటానికి, ఆర్థికంగా విస్తరించటానికి మరింతగా ప్రయత్నించాల్సి వుంది. ఇందుకు అవరోధాలు తక్కువేం లేవు. సంస్థలోని రెండు సభ్య దేశాలు రష్యా, ఇరాన్ యుద్ధాల్లో కూరుకుపోయాయి. వాటితో ఒప్పందాలు కుదుర్చుకునే దేశాలపై అమెరికా ఆంక్షల కత్తి వేలాడుతోంది. భారత్, పాకిస్తాన్ మధ్య వైరం అలాగే ఉంది. అమెరికా ఒత్తిళ్ల కారణంగా ఇరాన్ నుంచి మన దేశం చమురు కొనుగోళ్లను గణనీయంగా తగ్గించుకుంది. ఏడేళ్ల తర్వాత ఇటీవలే ముడి చమురు దిగుమతి చేసుకుంది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్తో జరిగిన ద్వైపాక్షిక సమావేశంలో రాగల కాలంలో ఆ దేశంతో మరిన్ని రంగాలకు వాణిజ్యాన్ని విస్తరించదల్చుకున్నట్టు మోదీ చెప్పారు. ఇరాన్పై మహా ఆర్థిక దిగ్బంధనాన్ని అమలు చేస్తామని అమెరికా ప్రకటించిన నేపథ్యంలో ఇది కీలక వాగ్దానం. భిన్న ప్రయోజనాలున్న, వివిధ రాజకీయ వ్యవస్థలున్న దేశాలమధ్య అర్థవంతమైన సహకారం విస్తరించటం అంత సులభమేమీ కాదు. ఈ పాతికేళ్లలో గణనీయంగా పెరిగిన ఎస్సీఓ... ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదాలను సమర్థవంతంగా ఎదుర్కొనాలన్న చైనా ప్రతిపాదనకు ఇప్పటికీ కట్టుబడే ఉన్నా, ఆచరణలో అదేమీ అమలుకావటం లేదు. మన దేశంలో ఉగ్రవాద దాడుల వెనక తన హస్తం లేదని దబాయించటంతోపాటు తమ దగ్గర జరిగే అలాంటి దాడుల్లో భారత్ ప్రమేయం ఉందని పాకిస్తాన్ ఎదురు ఆరోపిస్తోంది. ఇలాంటి డ్రామాలు కట్టిపెట్టి సభ్యదేశాలు చిత్తశుద్ధితో వ్యవహరించినప్పుడే ఏ సంస్థలైనా లక్ష్యసాధనలో విజయం సాధిస్తాయి. ఎస్సీఓ విస్తరణ మంచిదే... దాని మాటెలావున్నా ఆ సంస్థ బలపడాలంటే పెడ ధోరణులను అరికట్టడం తప్పనిసరి.

## దేశవ్యాప్తంగా ఒక లక్ష ఛార్జింగ్ పాయింట్లు..

**ముంబై :** టాటా మోటార్స్ ఴ జేఎస్డబ్ల్యూ ఎంజీ మోటార్ వంటి కంపెనీలు ఇప్పటికే చిన్న ఎలక్ట్రిక్ కార్లను విక్రయిస్తున్నాయి. అయితే, దేశంలో అతి పెద్ద కార్ల తయారీ కంపెనీ అయిన మారుతి సుజుకి మాత్రం ఈ విషయంలో ఇంకా వెనుకబడి ఉంది. అయితే.. దేశంలో తగినంత ఛార్జింగ్ మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత చిన్న ఈవీలను తీసుకురావాలని ఈ కంపెనీ భావిస్తోంది. కంపెనీ వార్షిక సాధారణ సమావేశంలో మేనేజింగ్ డైరెక్టర్ హిసాషి టకేయుచి ఈ విషయాన్ని వెల్లడించారు. భారత్లో ఇఒ ఛార్జింగ్ సదుపాయాలు సిద్ధమైన వెంటనే తమ పోర్ట్ఫోలియోలో చిన్న ఎలక్ట్రిక్ కార్లను చేరుస్తామని ఆయన చెప్పారు.ప్రస్తుతం మారుతి సుజుకి నుంచి భారత్లో ఒకే ఒక అందుబాటులో ఉంది. అది ఈ విటారా. అయితే భవిష్యత్తులో చిన్న ఎలక్ట్రిక్ కార్లను కూడా తీసుకొచ్చే అవకాశం ఉంది. దీనికి ముందుగా దేశవ్యాప్తంగా ఛార్జింగ్ నెట్వర్క్ను బలోపేతం చేయాలని కంపెనీ నిర్ణయించింది.మారుతి సుజుకి ఇప్పటికే 13 ఛార్జ్ పాయింట్ ఆపరేటర్లతో ఒప్పందం కుదుర్చుకుంది. దేశవ్యాప్తంగా 1,100కు పైగా నగరాల్లో 2,000కు పైగా ప్రత్యేక ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేసింది. హైవేలు ఴ ఎక్స్ప్రెస్వేలపై కూడా ఛార్జింగ్ సదుపాయాలను పెంచేందుకు కంపెనీ ప్రయత్నిస్తోంది. దేశంలోని టాప్ 100 నగరాల్లో ముఖ్యమైన ప్రాంతాల్లో ఛార్జర్లను ఏర్పాటు చేయాలని ప్రణాళిక వేసింది. ఒక్కో ఛార్జింగ్ పాయింట్ మధ్య సుమారు 5 నుంచి 10 కిలోమీటర్ల దూరం ఉండేలా నెట్వర్క్ను విస్తరించనుంది.మారుతి సుజుకి దీర్ఘకాలికంగా భారీ లక్ష్యాన్ని పెట్టుకుంది. ఈ దశాబ్దం (2030) ముగిసే నాటికి దేశవ్యాప్తంగా 1,00,000కు పైగా ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. చిన్న ఈవీలను తీసుకురావడానికి ఈ ఛార్జింగ్ నెట్వర్క్ విస్తరణ కీలకంగా మారనుంది. ప్రస్తుతం ఛార్జింగ్ సదుపాయాలు ప్రధాన నగరాల్లో మాత్రమే, అవి కూడా పరిమితంగా ఉన్నాయి. చిన్న ఎలక్ట్రిక్ కార్లను సామాన్య వినియోగదారులకు చేరువ చేయాలంటే విస్తృతమైన ఛార్జింగ్ నెట్వర్క్ అవసరమని మారుతి భావిస్తోంది.మారుతి సుజుకి కేవలం ఇఒలపైనే దృష్టి పెట్టడం లేదు. పెట్రోల్ ఇంజిన్ వాహనాలు, హైబ్రిడ్ కార్లు ఴ వాహనాలపై కూడా పెట్టుబడులు కొనసాగించనుంది. ఎఅఇ వాహనాలు తమ వ్యాపారంలో కీలకంగా కొనసాగుతాయని హిసాషి టకేయుచి తెలిపారు. కంప్రెస్ట్ బయోగ్యాస్ కూడా భవిష్యత్తులో ఈ వాహనాలకు డిమాండ్ కొనసాగేందుకు సహాయపడుతుందని కంపెనీ భావిస్తోంది.మారుతి కొత్త తయారీ ప్లాంట్లను కూడా విభిన్నంగా రూపొందిస్తోంది. ఒకే ప్రొడక్షన్ లైన్పై , హైబ్రిడ్ వాహనాలు, సీఎన్జీ కార్లు ఴ వాహనాలను తయారు చేసే విధంగా ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. దీంతో మార్కెట్లో ఏ రకం వాహనాలకు డిమాండ్ పెరిగితే ఆ దిశగా ఉత్పత్తిని వేగంగా మార్చుకోవచ్చు. మొత్తంగా చూస్తే.. చిన్న విషయంలో మారుతి తొందరపడటం లేదు.

# పౌష్టికాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యం




**నిజామాబాద్ :** పౌష్టికాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమని మెడికవర్ హాస్పిటల్స్ జనరల్ మెడిసిన్ కన్సల్టెంట్ డాక్టర్ ఆనంద్ మాలు, డైటీషియన్ శ్రీలేఖ అన్నారు. సెప్టెంబర్ 1 నుండి 7 వరకు దేశవ్యాప్తంగా నిర్వహించే 'జాతీయ పోషణ వారోత్సవాలు' సందర్భంగా హాస్పిటల్‌లో మాట్లాడారు.

**జీవనశైలే వ్యాధులకు కారణం..**

మన జీవనశైలే సర్వరోగాలకు కారణమని వైద్యుడు ఆనంద్ మాలు అన్నారు. నేటి జీవనశైలిలో సరైన పోషకాహారం తీసుకోకపోవడం వల్ల టైప్-2 మధుమేహం (డయాబెటిస్), అధిక రక్తపోటు (బీపీ), గుండె సంబంధిత సమస్యలు, ఊబకాయం వంటి వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. సమతుల్య ఆహారం తీసుకోకపోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గి, తరచూ ఇన్?ఫెక్షన్లు బారిన పడే అవకాశం ఉంది అని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ ఏడాదికి ఒకసారైనా విటమిన్ డీ, విటమిన్ బీ--12, ఐరన్, హిమోగ్లోబిన్ శాతాన్ని పరిశీలించుకోవాలని తెలిపారు. ప్యాక్ చేసిన, జంక్ ఫుడ్, మితిమీరిన ఉప్పు, నూనె, చక్కెర కలిగిన పదార్థాలను తగ్గించాలని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన ఆహారంతో పాటు రోజుకు కనీసం 30 నిమిషాల వ్యాయామం లేదా నడక తప్పనిసరి అని సూచించారు.

**ప్లేట్ పద్ధతిలో పోషకాలు సమకూరాలి**

డైటీషియన్ శ్రీలేఖ మాట్లాడుతూ పోషకాహారం అంటే ఖరీదైన ఆహారం కాదని, మనకు స్థానికంగా లభించే సహజ సిద్ధమైన పదార్థాలతోనే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చన తెలిపారు. ప్రతిరోజూ ఆహారంలో పప్పు ధాన్యాలు, గుడ్లు, పనీర్, మొలకెత్తిన విత్తనాలు ఉండేలా చూసుకోవాలన్నారు. జొన్నలు, రాగులు, సజ్జలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయని పేర్కొన్నారు. రోజువారీ భోజనంలో ఆకుకూరలు, తాజా కూరగాయలు కాల అనుగుణంగా లభించే పండ్లను తీసుకోవాలన్నారు. రోజుకు 2.5 నుండి 3 లీటర్ల నీరు తాగాలని సూచించారు. అలాగే మెడికవర్ హాస్పిటల్స్ యాజమాన్యం తరపున సెంటర్ హెడ్ స్వామి మాట్లాడుతూ జిల్లా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తమ ఆస్పత్రి ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక పోషకాహార కౌన్సెలింగ్ హెల్ప్ డెస్క్ అందుబాటులో ఉంచామన్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకుని సూచించారు

# భూభారతి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



**నిర్మల్ :** జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూభారతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భూభారతి దరఖాస్తుల పరిష్కారంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, వాటి పరిష్కార ప్రగతిని పరిశీలించారు. ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యానికి తావులేకుండా నిర్ణీత గడువులోగా పెండింగ్ కేసులన్నింటినీ క్లియర్ చేయాలని స్పష్టం చేశారు. ఏదైనా సాంకేతిక లేదా ఇతర కారణాలతో దరఖాస్తును తిరస్కరించాల్సి వస్తే, తిరస్కరణకు గల స్పష్టమైన కారణాలను రికార్డుల్లో తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే 22ఏ (22బా) నిషేధిత జాబితాలోని భూములకు సంబంధించిన సమస్యలను ప్రత్యేకంగా పరిశీలించి, నిబంధనల మేరకు తక్షణమే పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తుదారులకు పారదర్శకంగా, నిబంధనల ప్రకారం సేవలు అందించడంతో పాటు భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీవో దేవీదాస్, సంబంధిత శాఖల అధికారులు, తహసీల్దార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హనుమకొండ పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**వరంగల్ :** ధర్మసాగర్ మండలం సాయిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి గురువారం ప్రారంభించారు. ముందుగా ఉన్నత పాఠశాలలో, తదుపరి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఇడ్లీ సాంబార్ తో ఉన్న అల్పాహారాన్ని జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారనే వివరాలను ప్రధానోపాధ్యాయులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాలకు ఎఫ్ఎల్ఎన్ మెటీరియల్ వచ్చిందా అని, రెమెడియల్ తరగతులు నిర్వహిస్తున్నారని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాపురావును కలెక్టర్ అడిగారు. ఎఫ్ఎల్ఎన్ వర్క్ బుక్ ను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పాఠశాలల ప్రాంగణంలోనే ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఎంతమంది చిన్నారులు హాజరయ్యారని కలెక్టర్ ఆరా తీశారు. అంగన్వాడి కేంద్రంలోని చిన్నారులతో కలెక్టర్ మాట్లాడుతూ... రైమ్స్ వచ్చా అని, చార్టు, గోడలపై వేసిన పక్షులు, జంతువులు బొమ్మలను చూపిస్తూ వాటి పేర్లు చెప్పాలని అనగా చిన్నారులు వాటి పేర్లను తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అడాలి లక్ష్మి, డీఈవో గిరిరాజు గౌడ్, తహసిల్దార్ బావ్ సింగ్, ఎంఈఓ శ్రీదేవి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రశాంతి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పర్సన్ రమాదేవి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణా నుంచి బీజేపీ ఫోకస్



**హైదరాబాద్ :** తెలంగాణాకు చెందిన జి కిషన్ రెడ్డి సీనియర్ నాయకుడు. ఆయన విద్యార్థి రాజకీయాల నుంచి బీజేపీలో పనిచేశారు. ఏబీవీపీ నుంచి యువ మోర్చా దాకా అక్కడ నుంచి బీజేపీలో అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉమ్మడి ఏపీలో పనిచేశారు. ఆయన ఎమ్మెల్యేగా అంబర్ పేట నుంచి మూడు సార్లు గెలిచారు. శాసన సభా పక్ష నాయకుడిగా కూడా వ్యవహరించారు. ఇక గత రెండు పర్యాయాలుగా ఆయన ఎంపీగా గెలిచారు. సికింద్రాబాద్ నుంచి ఆయన ప్రాతినిధ్యం వహిస్తూ కేంద్రంలో మంత్రిగా ఏడేళ్ళుగా కొనసాగుతున్నారు. తెలంగాణా బీజేపీకి కూడా ఆయన 2023 ఎన్నికలకు ముందు మరోసారి వ్యవహరించారు. ఇంతటి సుదీర్ఘమైన రాజకీయ చరిత్ర ఉన్న కిషన్ రెడ్డిని బీజేపీ పార్టీ వ్యవహారాలకు పూర్తిగా వాడుకుంటుంది అన్న ప్రచారం సాగుతోంది. బీజేపీ కీలక మార్పులు చేయబోతోంది అని అంటున్నారు. తెలంగాణలో ఈసారి ఎలాగైనా అధికారం అందుకోవాలని బీజేపీ చూస్తోంది. ఈ నేపథ్యంలో త్వరలో చేపట్టబోయే కేంద్ర మంత్రి వర్గ విస్తరణలో బీజేపీ ప్రాతినిధ్యం ఈ రాష్ట్రంలో రెట్టింపు చేయాలని ఆలోచిస్తోంది. ప్రస్తుతం రెండుగా ఉన్న కేంద్ర మంత్రి పదవులను నాలుగు చేయాలని బీజేపీ ఆలోచిస్తో అని అంటున్నారు. అంతే కాదు మహిళ బీసీ కోటాను కూడా అనుసరించి మరిద్దరికి కేంద్ర మంత్రి పదవులు ఇస్తారని అంటున్నారు. మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణకు కేంద్ర మంత్రిగా చాన్స్ ఖాయమని అంటున్నారు. అలాగే మల్కాజ్ గిరీ ఎంపీ ఈటెల రాజేందర్ కి కేంద్ర మంత్రి పదవి తథ్యమని అంటున్నారు. వీరిద్దరితో పాటు కొందరి సేవలను పార్టీ కోసం వినియోగించుకోవాలని చూస్తోంది అని అంటున్నారు. ఇక కేంద్ర మంత్రిగా సీనియర్ నేతగా ఉన్న కిషన్ రెడ్డిని బీజేపీ పార్లమెంటరీ బోర్డులోకి తీసుకుంటారు అని అంటున్నారు. తెలంగాణా నుంచి దక్షిణాది నుంచి బీజేపీ ఫోకస్ పెంచేందుకు ఇది ఉపయోగపడుతుందని అంటున్నారు. బీజేపీకి పార్లమెంటరీ బోర్డు చాలా కీలకం అని చెబుతున్నారు. ఎవరికి ఎక్కడ టికెట్ ఇవ్వాలన్నా ఈ అత్యున్నత విధాయక మండలి నిర్ణయిస్తుంది. ప్రధాని సహా కీలక నేతలు అంతా ఉండే ఈ బోర్డులోకి కిషన్ రెడ్డిని తీసుకుంటారు అని అంటున్నారు. దాని ద్వారా రానున్న కాలంలో తెలంగాణా రాజకీయాన్ని మరింత క్లోజ్ గా మోనిటరింగ్ చేస్తారు అని అంటున్నారు. 2028లో జరిగే ఎన్నికల్లో ఎవరికి టికెట్ ఇవ్వాలి అన్నది కూడా ఇంకా బాగా అధ్యయనం చేసేందుకు ఇది దోహదపడుతుందని అంటున్నారు. అలాగే సమర్థులకు పనిమంతులకు టికెట్ ఇవ్వడం ద్వారా వచ్చే ఎన్నికల్లో గెలిచి తీరాలని బీజేపీ వ్యూహ రచన చేస్తోంది. అంతే కాదు బీజేపీలో ప్రముఖ నేతలలో ఒకరికి గవర్నర్ చాన్స్ కూడా ఇస్తారని అంటున్నారు. దాని వల్ల ఈ ప్రాంతం మీద బీజేపీ మరింతగా శ్రద్ధ చూపిస్తోంది అన్న సందేశం ఇవ్వాలని అనుకుంటోంది. ఇక రానున్న కాలంలో రాజ్యసభ సీటు వంటి పదవులు కూడా తెలంగాణాకు దక్కవచ్చు అని అంటున్నారు. మొత్తం మీద జాతీయ కార్యవర్గంలో చోటు లేదని భావించే చోట తెలంగాణా నుంచి కిషన్ రెడ్డిని పార్లమెంటరీ బోర్డులోకి తీసుకుంటారు అన్న ప్రచారం సాగుతోంది.

## సెప్టెంబర్ 4 న మాంసం ఉ బీఫ్ దుకాణాల మూసివేత జీహెచ్ఎంసీ ఆదేశాలు

**హైదరాబాద్,** శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని 04 సెప్టెంబర్ 2026న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలోని అన్ని గొర్రెలు, మేకలు మరియు పశువుల కబేళాలతో పాటు రిటైల్ మాంసం ఉ బీఫ్ దుకాణాలను మూసివేయాలని జీహెచ్ఎంసీ ఆదేశాలు జారీ చేసింది.జీహెచ్ఎంసీ చట్టం, 1955లోని సెక్షన్ 533(బి) కింద జారీ చేసిన నోటీసు ప్రకారం, శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదిన ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు.జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని గొర్రెలు, మేకలు మరియు పశువుల కబేళాలు, మాంసం ఉ బీఫ్ దుకాణాల మూసివేతను సమర్థవంతంగా అమలు చేయడంలో మున్సిపల్ అధికారులకు పూర్తి సహకారం అందించాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్లను కోరారు.

## చంచల్గూడ - సంతోష్ నగర్ స్టీల్ ఫ్లైఓవర్ ను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం నాడు చంచల్ గూడ ? సంతోష్ నగర్ స్టీల్ ఫ్లై ఓవర్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎంపీలు అసదుద్దీన్ ఓవైసీ, వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు హాజరయ్యారు. రూ.620 కోట్లతో 3.2 కిలోమీటర్ల పొడవు,16.6 మీటర్ల వెడల్పుతో నాలుగు లేన్లుగా ఫ్లై ఓవర్ నిర్మాణం జరిగింది. ముఖ్యమంత్రి ఓపెన్ టాప్ వాహనంలో ప్రయాణించి ఫ్లైఓవర్ ను పరిశీలించారు.

## తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన.. 13 జిల్లాలకు ఎల్లో అలర్ట్

హైదరాబాద్/అమరావతి:తెలుగు రాష్ట్రాల్లో రాగల కొద్దిరోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈశాన్య మధ్యప్రదేశ్ పరిసరాల్లో కొనసాగుతున్న అల్పపీడనం, దానికి అనుబంధంగా ఉన్న ఉపరితల ఆవర్తనంతో పాటు బంగాళాఖాతం వరకు విస్తరించిన రుతుపవన ద్రోణి ప్రభావంతో వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు.తెలంగాణలో ఎల్లో అలర్ట్తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముండటంతో 13 జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం 'ఎల్లో అలర్ట్' జారీ చేసింది. రాజధాని హైదరాబాద్‌తో పాటు జగిత్యాల, కామారెడ్డి తదితర ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడొచ్చని పేర్కొంది.ఏపీలో మూడు రోజుల పాటు వానలుఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో సెప్టెంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు వర్షాలు కురుస్తాయని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది. పలుచోట్ల ఉరుములు, బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షాలు నమోదయ్యే సూచనలున్నాయని స్పష్టం చేసింది.అధికారుల హెచ్చరికలు × వర్షాల నేపథ్యంలో బంగాళాఖాతం అల్లకల్లోలంగా మారే ప్రమాదం ఉన్నందున సెప్టెంబర్ 3, 4 తేదీల్లో మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు. × వర్షం కురిసే సమయంలో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్లు, విద్యుత్ స్తంభాలు, భారీ హోర్డింగ్‌ల కింద నిలబడవద్దని సూచించారు.

## ఇంకుడు గుంతలను పరిశీలించిన కేంద్ర బృందం.

**కమాన్ పూర్** .కమాన్‌పూర్ మండలం పేరపల్లి గ్రామంలో చేపడుతున్న ఇంకుడు గుంతల నిర్మాణాలను కేంద్ర బృందం ప్రతినిధులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణాలు, నిర్వహణ తీరుపై బృందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ విధిగా ఇంకుడు గుంతలు నిర్మించుకొని భూగర్భ జలాల పెంపునకు సహకరించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొంగోని సదయ్య, పంచాయతీ కార్యదర్శి సాయిశ్రీ, ఫీల్డ్ అసిస్టెంట్ పోల్దసరి రవి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## సరైన డాక్యుమెంట్లు అప్పగించాలి.

**తహసిల్దార్ వాసంతి.**

**కమాన్ పూర్** ఓటరు జాబితాలో సవరణలో భాగంగా నోటీసులు అందిన వారు సరైన డాక్యుమెంట్లు అందజేయాలి అని కమాన్ పూర్ తహసిల్దార్ ముస్త్యాల వాసంతి పేర్కొన్నారు. గురువారం కమాన్ పూర్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ రంగుల సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన ఓటర్ సవరణ జాబితాలో భాగంగా నోటీసు అందిన వారు తమ తమ డాక్యుమెంట్లను అందజేశారు. ఈ సందర్భంగా తాసిల్ దార్ వాసంతి మాట్లాడుతూ నోటీసును పూర్తిగా పరిశీలించి అందులో అవసరమైన డాక్యుమెంట్లు తీసుకొని అట్టి ఓటర్ లిస్టులో సవరణ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి ఓటును సురక్షితంగా ఉంచడమే తమ ధ్యేయమని అందుకొరకే గ్రామ గ్రామాన గ్రామసభలు నిర్వహించి ప్రతి ఒక్కరి ఓటును క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎవరు కూడా నోటీసులు వచ్చిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వారి ఓటును తప్పనిసరిగా అదే గ్రామంలో ఉంచడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ స్రవంతి, జిపిఓ జ్యోతి, ఉప సర్పంచ్ రఫిక్ సోహెల్, తో పాటు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## రుయా ఆసుపత్రిలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పారామెడికల్ విద్యార్థుల భారీ ర్యాలీ

**విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు ఎస్ఎఫ్ఐ సంపూర్ణ మద్దతు**

**పారామెడికల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే విద్యార్థి ఉద్యమాల్ని ఉదృతం చేస్తాం**

**తిరుపతి:** పారామెడికల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రుయా ఆసుపత్రిలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది.ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా అధ్యక్షురాలు పి. పవిత్ర ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగేళ్లలో పూర్తికావాల్సిన పారామెడికల్ కోర్సు అకాడమిక్ ఇయర్ ఆలస్యం కారణంగా 2021లో చేరిన విద్యార్థులకు 2026 వచ్చినా పూర్తికాని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పుడు మరో సంవత్సరం ఇంటర్న్‌షిప్ చేయాలని యాజమాన్యం చెప్పడం విద్యార్థులపై అదనపు భారమని అన్నారు.ఇదే సమయంలో కాలేజీ యాజమాన్యం మరో సంవత్సరం పాటు ఇంటర్న్‌షిప్ చేయాలని విద్యార్థులను ఆదేశించడం సరికాదని, విద్యార్థులు ఒక సంవత్సరం ఇంటర్న్‌షిప్ చేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, ఆ కాలంలో వారు అందించే సేవలకు తగిన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.12 గంటలు సేవలు.. కనీసం రూ.15,000 స్టైఫండ్ ఎందుకు ఇవ్వరు అంటూ పారా మెడికల్ స్టూడెంట్స్ ప్రశ్నించారు.రాష్ట్రంలోని అనేక జిల్లాల నుంచి విద్యార్థులు వచ్చి ఎస్వీ మెడికల్ కాలేజీలో పారామెడికల్ విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో చాలామంది ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, విద్యార్థులకు కనీసం ప్రభుత్వ హాస్టల్ సౌకర్యం కూడా అందుబాటులో లేకపోవడం తీవ్ర ఆందోళన కలిగించే అంశమని తెలియజేశారు.ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు దాదాపు 12 గంటల పాటు విద్యార్థులు ఆసుపత్రిలోని ల్యాబ్స్, ఎమర్జెన్సీ వార్డులు, ఇతర విభాగాల్లో రోగులకు సేవలు అందిస్తున్నారు. వైద్య వ్యవస్థలో కీలకమైన సేవలు అందిస్తున్న ఈ విద్యార్థులను కేవలం శిక్షణార్థులుగా చూసి వారి శ్రమకు ఎటువంటి పారితోషికం ఇవ్వకపోవడం దోపిడీతో సమానమని ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా అధ్యక్షురాలు పి. పవిత్ర అన్నారు."విద్యార్థులు ఒక సంవత్సరం ఇంటర్న్‌షిప్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. కానీ 12 గంటల పాటు ఆసుపత్రిలో సేవలు అందిస్తున్న విద్యార్థులకు కనీసం నెలకు రూ.15,000 స్టైఫండ్ ఇవ్వాలి. ప్రభుత్వ హాస్టల్ సౌకర్యం కల్పించాలి. అకాడమిక్ ఇయర్ ఆలస్యంతో ఇప్పటికే సంవత్సరాల సమయం కోల్పోయిన విద్యార్థులపై మరో సంవత్సరం భారాన్ని మోపకుండా ప్రభుత్వం తక్షణమే జోక్యం సమస్య పరిష్కరించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి రవీంద్ర నగర కమిటీ సభ్యులు భాస్కర్ మారుతి తదితరులు పాల్గొన్నారు

నవగీతం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
4 సెప్టెంబర్ 2026

# శిశు మరణాల నివారణకు సమన్వయంతో పనిచేయాలి.

## జగిత్యాల జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి. సుజాత



**జగిత్యాల,సెప్టెంబర్3,(నవగీతం):** జగిత్యాల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి. సుజాత అధ్యక్షతన గురువారం శిశు మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో నమోదైన శిశు మరణాల కారణాలను విశ్లేషించి, నివారణ చర్యలను మరింత పటిష్టంగా అమలు చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు.ఈసమావేశంలో జిల్లాలో నమోదైన శిశు మరణాలకు దారితీసిన కారణాలు, హైరిస్క్ గర్భిణీల పర్యవేక్షణ, ప్రసవాల నిర్వహణ, నవజాత శిశువుల సంరక్షణ, అత్యవసర రిఫరల్ సేవలపై సమగ్రంగా సమీక్షించారు.హైరిస్క్ గర్భిణీలను గుర్తించి నిరంతరం పర్యవేక్షించాలని, గర్భిణీలకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తూ అవసరమైన ఆరోగ్య సేవలు అందించాలని డాక్టర్ జి. సుజాత సూచించారు. ప్రసవ సమయంలో తల్లి, శిశువుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, అవసరమైన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నవజాత శిశువుల్లో అనారోగ్య లక్షణాలను తొలిదశలోనే గుర్తించి, పరిస్థితి తీవ్రతను బట్టి ఆలస్యం లేకుండా ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేయాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్యాధికారులు సమన్వయంతో పనిచేసి శిశు మరణాల నివారణకు కృషి చేయాలని సూచించారు. ప్రతి శిశు మరణాన్ని చైల్డ్ డెత్ రివ్యూ ద్వారా సమగ్రంగా విశ్లేషించి, మరణానికి దారితీసిన కారణాలను గుర్తించాలని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన సరిదిద్దే చర్యలను వెంటనే అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓలు డాక్టర్ ఎన్. శ్రీనివాస్, డాక్టర్ ఎం. జైపాల్ రెడ్డి, డీఐఓ డాక్టర్ నరేంద్ర, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ అర్చన, డాక్టర్ ఎన్. రాజేందర్, పీడియాట్రిషన్ డాక్టర్ గుండేటి అర్జున్, డాక్టర్ రమా పీడియాట్రిషన్ ,గైనకాలజిస్ట్ డాక్టర్ బి. ఉష, ఏ. భాస్కర్ డీడబ్ల్యూ ,మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ సతీష్ కుమార్, ,డాక్టర్ శివకుమారి, డాక్టర్ వాహిని, డాక్టర్ సౌజన్య ,హెచ్ ఈ ఓ.ఏ .రాజేశం, హెచ్ఏ ఈ రాథోడ్ ,తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాంలో జిల్లా కలెక్టర్ త్రైమాసిక తనిఖీ.



**ములుగు ,సెప్టెంబర్ 03,(నవగీతం)** ఈవీఎం గోదాంలో జిల్లా కలెక్టర్ బోర్గడే హేమంత్ సహదేవరావు త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ బోర్గడే హేమంత్ సహదేవరావు ఆర్డీవో కార్యాలయ ఆవరణలోని ఈవీఎం గోదాంను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం సీల్ను పరిశీలించారు. గోదాంలో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రతా స్థితిని కలెక్టర్ పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, అగ్నిప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్ టింగ్విషర్లు, ఇతర భద్రతా పరికరాలను తనిఖీ చేశారు. అత్యవసర పరిస్థితులు తలెత్తిన సందర్భంలో అనుసరించాల్సిన భద్రతా చర్యలపై సంబంధిత సిబ్బందికి సూచనలు జారీ చేశారు. గోదాం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా రిజిస్టర్లు, సందర్శకుల నమోదు పుస్తకాలను పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించేందుకు ప్రతి నెల గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాం తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి రాజీ లేకుండా 24 గంటలు భద్రతా ప్రమాణాలను పక్కడ్బీగా అమలు చేస్తున్నామని, గోదాంలోని భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఎం.డి. సలీం, డిప్యూటీ తహసీల్దార్ నితీష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ మనోహర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రైతాంగంపై వివక్షకు నిరసనగా బీఆర్ఎస్ సమరభేరి

## కాంగ్రెస్ హామీల అమలులో విఫలమైందని బీఆర్ఎస్ నాయకుల ఆరోపణ



**కొడిమ్యాల,సెప్టెంబర్ 03.(నవగీతం)** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ప్రజలు, రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. రైతాంగ సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ గురువారం కొడిమ్యాల మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రామకిష్టాపూర్ గ్రామశాఖ అధ్యక్షుడు తిరుపతి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను ప్రస్తావిస్తూ పాట రూపంలో ఘనంగా పాడి కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. రైతులకు రైతుభరోసా, రైతుబీమా తదితర హామీలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయలేదని పాట రూపంలో నిరసన తెలిపారు.అనంతరం బీఆర్ఎస్ నాయకులు పునుగోటి కృష్ణారావు, పులి వెంకటేశం గౌడ్, పిడుగు ప్రభాకర్‌రెడ్డి, సురుగు శీను, కొత్తూరు స్వామి, భూపతి రెడ్డి, లింగ గౌడ్, చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రైతులకు రూ.15 వేల రైతుభరోసా, రూ.2 లక్షల రుణమాఫీ, మహిళలకు రూ.4 వేల పింఛన్, వికలాంగులకు రూ.6 వేల పింఛన్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు.ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు.కొడిమ్యాల మండలంలో పలువురు రైతులకు ఇప్పటికీ రుణమాఫీ పూర్తికాలేదని, ఎరువులు, విత్తనాల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.రైతులు అప్పుల కోసం సావకారులను ఆశ్రయించే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు.కేసీఆర్ హయాంలో రైతులకు అండగా..బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రైతుబంధు, రైతుబీమా, సాగునీరు, 24 గంటల విద్యుత్ వంటి పథకాలతో రైతులకు అండగా నిలిచారని నాయకులు పేర్కొన్నారు. రైతు ఏ కారణంతో మరణించినా రూ.5 లక్షల రైతుబీమా అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో 24 గంటల విద్యుత్ సరఫరా లేదని, సాగునీటి సమస్యలు పెరిగాయని విమర్శించారు.కన్నెపల్లి పంపుల వద్ద నీరు అందుబాటులో ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. దీంతో మండలంలోని పలు ప్రాంతాల్లో నాట్లు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను 1000 రోజులు గడిచినా అమలు చేయలేదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ప్రజలు, రైతులు, మహిళలు, విద్యార్థులు సహా అన్ని వర్గాల సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని, హామీలను అమలు చేసే వరకు ఉద్యమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు వార్డు సభ్యులు కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఐఈడీ పేలుడులో మృతి చెందిన మడకం నాగేశ్వరరావు.

## కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు.

**ములుగు, సెప్టెంబర్3,(నవగీతం)** ములుగు జిల్లా వెంకటాపురం పరిధిలోని కర్రిగుట్ట సమీపంలో బుధవారం జరిగిన విషాదకర ఐఈడీ పేలుడు ఘటనలో నూగూరు గ్రామానికి చెందిన మడకం నాగేశ్వరరావు కుటుంబాన్ని భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు పరామర్శించారు. వెదురు బొంగుల కోసం అడవికి వెళ్లిన సమయంలో ఐఈడీ పేలడంతో మడకం నాగేశ్వరరావు మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు హుటాహుటిన వెంకటాపురం మండలానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చి, మనోధైర్యం కల్పించారు. ప్రభుత్వం తరపున కుటుంబానికి అన్ని విధాలా సహాయం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# దివ్యాంగ విద్యార్థులకు హైదరాబాద్ విజ్ఞాన విహారయాత్ర



**కరీంనగర్, సెప్టెంబర్3,(నవగీతం):** కరీంనగర్ జిల్లాలో 16 భవిత కేంద్రాలలో విద్యను అభ్యసిస్తున్న దివ్యంగా పిల్లలను గురువారం హైదరాబాదుకు క్షేత్ర పర్యటన చేయించడం జరిగింది.మూడు ప్రత్యేక బస్సులలో, భవిత కేంద్రాల నుండి బయలుదేరి, హైదరాబాదులోని బిర్లా ప్లానిటోరియం బిర్లా సైన్స్ మ్యూజియం ఎన్టీఆర్ గార్డెన్స్ అంబేద్కర్ విగ్రహం తదితర ప్రాంతాలు సందర్శించడం జరిగింది.జిల్లా కలెక్టర్ ఆదేశాలతో విద్యాశాఖ అధికారులతో పాటు వైద్యశాఖ, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది విద్యార్థులతో పాల్గొనడం జరిగింది.ఈ యాత్రను జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి చైతన్యజైని జండా ఊపి ప్రారంభించారుఈ విజ్ఞాన యాత్రలో 16 మండలాల భవిత విద్యార్థులు విలీన విద్యా రిసోర్సు పర్సనల్ ప్రత్యేక ఉపాధ్యాయులు, భవిత కేంద్ర ఆయాలు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన జువ్వాడి



**మల్లాపూర్,సెప్టెంబర్3,(నవగీతం)** మల్లాపూర్ మండలం గుండంపల్లి గ్రామంలో బుధవారం మృతి చెందిన ఉరుమడ్ల చిన్న ఆకరాజం కుటుంబాన్ని గురువారం కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పారు.అనంతరం ఉరుమడ్ల చిన్న ఆకరాజం మృతిపట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన జువ్వాడి కృష్ణారావు, మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో గుండంపల్లి గ్రామ సర్పంచ్ దప్పుల పద్మ నర్సయ్య, ఏఎంసీ చైర్‌పర్సన్ అంతడుపుల పుష్పలత నర్సయ్య, ఏఎంసీ చైర్మన్ అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ మామిడి లక్ష్మారెడ్డి, అంతడుపుల గంగాధర్, గున్నాల విజయ్, దప్పుల నరేష్, చెప్పాల గంగారం, పెండెం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# అక్షర భారతి కాన్వెంట్ స్కూల్ లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు




**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 03 ( నవగీతం )** ఇబ్రహీంపట్నం మండలం పరిధిలోని వర్ష కొండ గ్రామంలో అక్షర భారతి కాన్వెంట్ స్కూల్ లో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం చిన్నారుల నృత్య ప్రదర్శనలు, ఉట్టి కొట్టే కార్యక్రమం అందరినీ ఎంతగానో అలరించాయి. చిన్నతనం నుంచే పిల్లలకు భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు, ఆధ్యాత్మిక భావనలు అలవడేలా పాఠశాలలో ప్రతి పండుగను ఘనంగా నిర్వహిస్తున్నామని కరెస్పాండెంట్ దగ్గుల అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ దగ్గుల అశోక్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు,

# విన్నర్స్ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు

## కృష్ణుడు,రాధ వేషధారణలో చిన్నారుల సందడి




**కొడిమ్యాల, సెప్టెంబర్ 03.(నవగీతం)** కొడిమ్యాల మండల కేంద్రంలోని విన్నర్స్ ఇంగ్లీష్ స్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని రంగురంగుల అలంకరణలతో సుందరంగా తీర్చిదిద్దారు.చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధాదేవి వేషధారణలో ముస్తాబై అందరినీ ఆకట్టుకున్నారు.శ్రీకృష్ణుడి బాల్యలీలలు, గోపికలతో ఆటపాటలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలను విద్యార్థులు ప్రదర్శించారు.చిన్నారుల వేషధారణలు, ప్రదర్శనలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ..భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల ప్రాధాన్యతను చిన్నారులకు తెలియజేయడంతో పాటు, వారిలో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామ ప్రజలకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.

# ఉచిత శిక్షణతో యువత ఉద్యోగ కలలకు తోడ్పాటు.

### విజయం సాధించే వరకు ప్రయత్నం చేయాలి: మంత్రి సీతక్క.



**ములుగు,సెప్టెంబర్3,(నవగీతం)** ములుగు ఆర్టీసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బోర్గడే హేమంత్ సహదేవరావుతో కలిసి రాష్ట్ర పంచాయతీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అనసూయ సీతక్క కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాలకు ఉచిత శిక్షణ పొందనున్న అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ చదువుకొని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతీ యువకులకు తగిన ప్రోత్సాహం, శిక్షణ అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఉద్యోగ ప్రకటన వెలువడిన వెంటనే జిల్లా ఎస్పీతో చర్చించి ఉచిత శిక్షణ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. శిక్షణ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లలో పూర్తి సహకారం అందించిన జిల్లా కలెక్టర్ ను అభినందించారు. టాప్స్ సౌజన్యంతో అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించేందుకు ముందుకొచ్చిన విశ్వనాథ్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులను మంత్రి అభినందించారు.

పోలీస్ ఉద్యోగాల ఎంపికలో శారీరక ప్రమాణాలు కీలకమైనందున అభ్యర్థులు కష్టపడి సిద్ధమైన తర్వాత కొలతల కారణంగా అనర్హులు కాకుండా ముందుగానే పరిశీలన చేపట్టినట్లు తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక శారీరక కొలతలు పరిశీలించి శిక్షణకు ఎంపిక చేసిన 250 మంది అభ్యర్థులను అభినందించారు. శిక్షణ పొందుతున్న ప్రతి ఒక్కరూ పట్టుదలతో చదివి ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించాలన్నదే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు.

ములుగు నియోజకవర్గ పరిధిలోని ఇతర జిల్లాలకు చెందిన యువతకు కూడా శిక్షణ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలోని గంగారం, కొత్తగూడ మండలాల యువత కోసం అక్కడి కలెక్టర్, ఎస్పీతో మాట్లాడామని, ఆ జిల్లాలో కూడా శిక్షణ ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. భూపాలపల్లి జిల్లాలో ఉన్న నియోజకవర్గ పరిధిలోని ఐదు గ్రామాల యువతకు కూడా అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గతంలో ఉద్యోగ మేళా నిర్వహించామని, ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు విజయం సాధించే వరకు ప్రయత్నం కొనసాగించాలని, రాత పరీక్షల్లోనైనా, శారీరక సామర్థ్య పరీక్షల్లోనైనా ఆశించిన ఫలితం రాకపోతే నిరుత్సాహపడకుండా మళ్ళీ ప్రయత్నించాలని సూచించారు. కుటుంబ బాధ్యతలకు సమయం కేటాయిస్తూనే చదువుకు, శారీరక సాధనకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పోషకాహారం తీసుకుంటూ క్రమం తప్పకుండా సాధన చేయాలని, శిక్షణ సమయంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తనకు లేదా డీఎస్పీకి తెలియజేయాలని సూచించారు. ఇప్పుడు కష్టపడి ఉద్యోగం సాధిస్తే భవిష్యత్తులో కుటుంబానికి అండగా ఉంటారని తెలిపారు.

# రైతు రాజ్యం రావాలంటే కేసీఆర్ అధికారంలోకి రావాలి






### రైతు సదస్సుతో గులాబీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం

**రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 3(నవగీతం)** బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన వైఫల్యాలు, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాయికల్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, రైతుల భారీ ర్యాలీ.ఉప్పొంగిన ఉత్సాహం తో తరలి వచ్చిన రైతులు బీ ఆర్ఎస్ నాయకులు.. కార్యకర్తలు. ఫ్ల కార్డులు, బీ ఆర్ ఎస్ పార్టీ జెండాలతో భారీ ర్యాలీ.రైతు సదస్సుకు ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి, మాజీ మంత్రి వర్యులు కొప్పుల ఈశ్వర్, జగిత్యాల జిల్లా పరిషత్ తొలి ఛైర్పర్సన్ దావ వసంత సురేష్ హాజరయ్యారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలనలో రైతుబంధు రైతు బీమా నీరుగార్చడంతో పాటు వరి ధాన్యం సేకరణలో తరుగు పేరిట కోత.వరి ధాన్యానికి బోనస్ ఎగవేత.అరకొర విద్యుత్ సరఫరాతో రైతాంగాన్నీ ఇబ్బందులకు గురి చేయడం పట్ల.నిరసన వ్యక్తం చేస్తూ రాయికల్ పట్టణంలో రైతు ర్యాలీ.రైతు సదస్సు నిర్వహించారు.రాయికల్ మండలంలో వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన రైతులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీ జెండాలు, ప్రభుత్వ వ్యతిరేక విధానాల నిరసిస్తూ ఫ్లకార్డుల తో పట్టణంలోని గాంధీ విగ్రహం నుండి మార్కెట్ వరకు ర్యాలీ నిర్వచించారు.బిఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉప్పొంగిన ఉత్సాహంతో.రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ. నినాదాలు చేస్తూ.భారీ ర్యాలీ నిర్వహించారు.మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ఉద్యమ నేతగా రాష్ట్రాన్ని సాధించి, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారు. ప్రజలను ఆశల పల్లకిలో ఊరేగించి,కాంగ్రెస్ అధికారంలో వచ్చింది.తెలంగాణ ప్రజలు రేవంత్ రెడ్డిని నమ్మరని, రాహుల్ గాంధీ తో వరంగల్ లో రైతు డిక్లరేషన్ చేయించారు. వెయ్యి రోజుల పాలనలో చేసిన వాగ్దానాలు అమలు చేయకపోవడం పై కేసీఆర్, కేటీఆర్ సూచనల మేరకు ప్రజలను చైతన్య పరిచేందుకు నిరసన చేపడుతున్నామన్నారు. పట్టణాల్లో బిఆర్ఎస్ పార్టీ కి అండగా నిలిచారు.మోసపూరిత హామీలతో గ్రామీణ ప్రాంతాల ప్రజలను ఆశల పల్లకిలో ఊరేగించి, అధికారంలో వచ్చారు.నాల్గు దశాబ్దాల రాజకీయాల అనుభవంలో

టిడిపి పాలన లో రైతు ల దోపిడీ పై యుద్ధం చేయాల్సి వచ్చింది. ఇటువంటి పాలన చూడలేదు.యూపీఏ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రాంతంలో రైతులకు విద్యుత్ భారం పడుతోందని, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించాలని కేసీఆర్ సూచన మేరకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టారు.కెసిఆర్ ఉద్యమ నేతగా పదవులు త్యాగం చేసి, ప్రజా క్షేత్రాన్ని ఎంచుకొని, రాష్ట్రాన్ని సాధించారు.ఉమ్మడి రాష్ట్రంలో 9 గంటల కరెంట్ ఇవ్వగా, కేసీఆర్ పాలనలో 24 గంటలు ఉచిత విద్యుత్ పంపిణీ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలోని విద్యుత్ ఉత్పత్తిని కేసీఆర్ పాలనలో విద్యుత్ ఉత్పత్తిని నాలుగింతలు చేశారు.రేవంత్ రెడ్డిని రెడ్డి కి చిత్తశుద్ధి లేకపోవడంతో 24 గంటలు విద్యుత్ ఇవ్వడం లేదు.కెసిఆర్ దూర దృష్టితో నిర్మించిన కాళేశ్వరం కరువులో ప్రాజెక్ట్ గొప్పతనం తెలుస్తుంది.పదేళ్ల కాలంలో ఎస్ ఆర్ ఎస్ పి లో కాలువ నీళు రాని దినం ఏనాడు చూడలేదు.కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం లక్షల కోట్ల లో పలుగు వచ్చిన పియర్స్ 200 కోట్లు మాత్రమే.అన్నారం సుందిల్ల లో ఉపయోగించుకోవచ్చు అని ఎన్ డీ ఏ సూచించినా కన్నె పల్లి నుండి నీటిని ఎత్తిపోస్తే కేసీఆర్ కి పేరు వస్తుంది అని రేవంత్ రెడ్డి కరువు తీసుకువచారు.రైతు బంధు.రైతు బీమా నీరుగార్చారు.రసాయనిక ఎరువులు తాగేది కాదు.తినేది కాదు. ఎరువుల పంపిణీ పై ఎందుకీ ఆంక్షలు.అని నిలదీశారు.కాలువల నీళ్ళు రావు.24 గంటలు కరెంట్ ఇవ్వరు.ఎరువులు పంపిణీ పై ఆంక్షలు.రేవంత్ రెడ్డి పాపం.ధాన్యం సేకరణలో ప్రతి 40 కిలోల సంచికి 3 నుండి 5 కిలోలు కోత పెట్టారు.ధర్మకాంట, ట్రాక్ షీట్ తూకం లో వ్యత్యాసాలు ఎందుకు.కోత రుజువు చేస్తేమంత్రి అడ్లూరి రాజీనామా చేస్తా అన్నారు. రాజీనామా చేయాల్సిన పని లేదు.విజిలెన్స్ విచారణ చేపట్టి, ధర్మ కాంట వ్యత్యాసం రైతులకు చెల్లించాలి.దూర దృష్టితో రైతు కుటుంబానికి భరోసా కల్పించేందుకు 5 లక్షలు అందజేశారు.రైతు రాజ్యం రావాలంటే గ్రామీణ ప్రాంతం కుల మతాలకు అతీతంగా అండగా నిలిచి కేసీఆర్ ను అధికారంలోకి తీసుకురావాలి.జగిత్యాల ఎమ్మెల్యే అభివృద్ధి కోసం అంటూ రేవంత్ రెడ్డి పకన చేరాడు కాంట్రాక్ట్, బిల్లుల కోసం పోయిన విషయం అందరికీ తెలిసిందే.బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు నిలిచిపోతున్నాయి.ఇందిరమ్మ ఇళ్లకు కొబ్బరికాయలు కొట్టడం బీ ఆర్ ఎస్ మంజూరు చేసిన పనులు మినహా చేసింది ఏమీ లేదు.బీడీ బార్మికులకు, వృద్ధాప్య పెన్షన్. ఇవ్వడం లేదు.22 ఏ తొలగించేందుకు బీ ఆర్ ఎస్ పార్టీ అండగా నిలుస్తుంది.మార్పు రావాలంటే అందరూ ఏకం కావాలి.అని పిలుపునిచ్చారు.కన్నెపల్లి పంప్ నుండి నీటిని ఎత్తి పోయాలి.. 24 గంటలు విద్యుత్ సరఫరా చేయాలి.ట్రాక్ షీట్, ధర్మ కాంట మధ్య వ్యత్యాసం రైతులకు చెల్లించాలి.మల్లాపూర్ చక్కర ఫ్యాక్టరీ అవశ్యకత తెర పైకి వచ్చింది.చక్కర ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం ఉద్యమించాలని పిలుపు నిచ్చారు.మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ..రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రేవంత్రెడ్డి పాలనలో రైతులకు జరిగిన అన్యాయాల పై విస్తృతంగా చర్చ జరగాలని నిరసన కార్యక్రమాలు చేపడుతున్నాం.రేవంత్ రెడ్డి మళ్ళీ మోసం చేసే మాటలు మాట్లాడుతున్నాడు.. ఇచిన ఒక్క మాటకు కూడా కట్టుబడి లేదు..దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా కేసీఆర్ పెట్టుబడి కింద రైతు బంధు ఇచ్చారు. రైతు బంధు రైతులందరికీ ఒకే రోజు అందరికి అందజేశారు. ఊహించని అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్ ది.రైతు బంధు కింద 15 వేలు, రైతు కూలీలకు ఇస్తామని చెప్పిన మాటలు ఎటుపాయే.వెయ్యి రోజులు అయితున్న. అమలు లేదు..



కేసీఆర్ పాలనలో ప్రజల కోసం..ఆస్తులు సృష్టించేందుకు 3.90 లక్షల కోట్ల అప్పు చేసిన మాట వాస్తవం కేసీఆర్ ప్రాజెక్టులు నిర్మించారు.. అన్ని రంగాలను అభివృద్ధి చేశారు.కేసీఆర్ అందరికీ రుణ మాఫీ చేశారు.రేవంత్ రెడ్డి రెండు లక్షలకు పైగా ఉన్న అప్పు ఉన్నవారు అప్పు చెల్లించిన వారికి రుణ మాఫీ కాలేదు.. 42 లక్షల మందికి రుణ మాఫీ చేయాల్సి ఉండగా, 21 లక్షల మందికి రుణ మాఫీ చేశారు. దిక్కు మాలిన పరిపాలనలో రైతు బీమా రెన్యువల్ చేయలేదు.కేసీఆర్ పాలనలో రైతు మృతి చెందితే ఇంటికే వెళ్లి 5 లక్షలు అందజేశారు. జీవిత కాలంలో ఇలాంటి అసమర్థ ముఖ్యమంత్రిని చూడలేదు.రేవంత్ రెడ్డి కి ఫోర్త్ సిటీ కి లక్ష్ కోట్లు ఉంటాయి.. మూసి ప్రక్షాళనకు 1.50 లక్షల కోట్లు ఉంటాయి కానీ ప్రజలకు పెన్షన్ ఇవ్వడం లేదు.కేసీఆర్ ఉన్నప్పుడు పుష్కలంగా యూరియా లభించింది.. ఇప్పుడు యాప్ పేరిట యూరియా గోస పోసుకున్నారు.

యాప్ దేశం అంత ఉండాలి. రైతులు పండించిన. పంటను కొనుగోలు చేయలేక, వ్యవసాయ రంగాన్ని చిన్నాభిన్నం చేస్తునారు.రెండు వందల పెన్షన్ ను 2000 లకు పెంచారు. ఇచిన హామీల అమలుకు కట్టుబడి ఉన్నామంటూ జిల్లా మంత్రి కాలయాపన చేస్తున్నారు.

12000 కోట్లు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించడం లేదు.అనాడు గురుకులాల్లో సీటు కోసం పోటీ ఉండేది.నేడు పిల్లలను గురుకులాల్లో చేర్పించేందుకు వెనకడుతున్నారు మూడేళ్లలో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యవస్థంగా మారింది.మూడేళ్ల లో రాష్ట్రం పదేళ్లు వెనక బడింది. రానున్న కాలంలో యుద్ధమే. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకముగా పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు.

మాజీ జడ్పీ ఛైర్పర్సన్ దావా వసంత సురేష్ మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతు బాగుంటేనే ఆర్థిక వ్యవస్థ వెన్నుముక రేవంత్ రెడ్డి పాలనలో రైతులు ఆరిగోస పడుతున్నారు.కేసీఆర్ మేనిఫెస్టో లో పెట్టకుండా రైతు బిడ్డగా రైతు కుటుంబాలను ఆదుకునేందుకు రైతు బీమా ప్రవేశ పెడితే రేవంత్ రెడ్డి రైతు బీమా కు మంగళం పాడారు.

కేసీఆర్ పెట్టుబడి సాయం కోసం పంట రైతు బంధు కింద ఎకరానికి 10 వేలు ఇచ్చారు. రైతు భరోసా పేరిట ఎకరానికి 15000 చెప్పి మోసం చేశారు.రైతు బంధు ఇవ్వడానికి ఎందుకు చొరవ చూపడం లేదు.100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి వెయ్యి రోజులైన అమలు చేయలేదు. కేసీఆర్ 24 గంటలు ఉచితముగా కరెంట్ సరఫరా చేశారు తండ్రి లాంటి పాలన కేసీఆర్ ది.తెలంగాణ రావొద్దని అనుకున్న రేవంత్ రెడ్డి ముఖ్య మంత్రిగా ఉండడం దురదృష్టకరం.కేసీఆర్ చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లారు.కేసీఆర్ కావాలని ఎమ్మెల్యేను గెలిపిస్తే రేవంత్ రెడ్డి పక్కన చేరారు.గతంలో మంజూరు అయిన 25 కోట్లు మాత్రమే ఒక్క రూపాయి మంజూరు కాలేదు.రాబోయే రోజుల్లో రేవంత్ రెడ్డి పాలనకు చరమగీతం పాడాలి.

# ఏక్ పేడ్ మా కే నామ్



**రాయికల్, సెప్టెంబర్ 03(నవగీతం) :** మనవ అవసరాల కోసం అడవిలో ఉన్న చెట్లను నరికి వేయడం, ప్లాస్టిక్ వినియోగం, సెల్ టవర్స్ రేడియేషన్, ఫ్యాక్టరీ నుండి వచ్చే వ్యర్థ పదార్థాలు, వాయువు కాలుష్యం పెరిగి పోవడంతో వాతావరణ కాలుష్యం పెరిగి ఎల్ నినో ఎఫెక్ట్ ఏర్పడడం తో మనకు సరియైన వర్షాలు పడకపోవడం దీని కొరకు పర్యావరణన్ని కాపాడడంలో భాగంగా ఏక్ పేడ్ మా కే నామ్ అంటే పిల్లలు, తల్లి కలిసి రెండు మొక్కలు నాటే కార్యక్రమముకు కుర్మపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎలిగట్టటి రాజకిశోర్ పిలుపు ఇవ్వగా పిల్లల తల్లులు వచ్చిన వారికి మీరు మీ పిల్లలను ఏవిధంగా ఎంత జాగ్రత్తగా పెంచుతారో అదేవిధంగా మొక్కలను నాటిన తరువాత వాటిని మీ పిల్లలు నీరు పోస్తు అంతే జాగ్రత్తగా మొక్కలు పెంచడం, కాపాడడం దీని ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఆ తరువాత పాఠశాల ఆవరణంలో మరియు పాఠశాలకు వచ్చె దారిలో గుంతలు తీసి 60 మొక్కలు పైగా నాటి నందుకు పిల్లల తల్లులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మ్యాకల మల్లేశం,గ్రామ ఉప సర్పంచ్ పుల్ల లత మల్లేష్, ప్రధానోపాధ్యాయులు ఎలిగట్టటి రాజకిశోర్, టీచర్ వోడ్నాల ప్రియాంక, పిల్లల తల్లులు మ్యాకల రజిత, దయ్యాల మంజుల, పుల్ల తిరుమల మ్యాకల లావణ్య, దయ్యాల స్వరూప, పుల్ల రజిత, శెట్టి అనుష్య, పుల్ల పద్మ, పుల్ల మనస, తుప్పతి గంగాజల, పుల్ల మహేశ్వరి, పుల్ల మంగ, దయ్యాల కల్యాణి, చెట్టె మమత, దయ్యాల జయలక్ష్మి, సంబ మల్లు, దయ్యాల పద్మ, తుప్పతి రేణుకా, పుల్ల మనీషా, అది నాగవ్వ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



**రాయికల్ ,సెప్టెంబర్ 03,(నవగీతం)** ఆలూరు ప్రాథమిక పాఠశాలలో ఘనంగా ప్రీ ప్రైమరీ విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ,కృష్ణాష్టమి వేడుకలు రాయికల్ మండలం ఆలూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు అక్కినపల్లి సతీష్ ప్రీ ప్రైమరీ విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ. తెలంగాణ ప్రభుత్వం ప్రీ–ప్రైమరీ విద్యార్థుల కోసం అందంగా తీర్చిదిద్దిన ప్రత్యేక తరగతి గదితో పాటు రెండు జతల యూనిఫాంలు, షూస్, నాణ్యమైన ఫర్నిచర్ మరియు ఆట వస్తువులను సమకూర్చిందని తెలిపారు. అంతేకాకుండా, ఈ విద్యా సంవత్సరం అదనంగా ప్రతి చిన్నారికి వారి స్థాయికి తగిన విధంగా సులువుగా అర్థమయ్యేలా రూపొందించిన పాఠ్యపుస్తకాలను కూడా ప్రభుత్వం అందజేసిందని వివరించారు. అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రీ–ప్రైమరీ విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అక్కినపల్లి సతీష్, గ్రామ సర్పంచ్ నల్లాల స్వామి, ఉప సర్పంచ్ చల్ల మహేష్ రెడ్డి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ చిలుక సంజీవ్, వైస్ చైర్మన్ శేఖర్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఆకట్టుకున్న కృష్ణాష్టమి వేడుకలు.పాఠ్యపుస్తకాల పంపిణీ అనంతరం పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు.విద్యార్థులు శ్రీకృష్ణుడు,గోపికల వేషధారణలతో ప్రత్యేకంగా ముస్తాబై అందరినీ విశేషంగా ఆకట్టుకున్నారు.చిన్నారుల నృత్యాలు, ప్రదర్శనలతో పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.

## రైతు బాంధవుడు కేసీఆర్..
## రైతు ద్రోహి రేవంత్ రెడ్డి

### బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల హరీష్ రెడ్డి ధ్వజం

**గోదావరిఖని**బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల్లో హామీలు అమలు చేయలేదని నిరసిస్తూ చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా రెండో రోజు పాలకుర్తి మండలం బసంత్నగర్ జీఎం గార్డెన్లో “వ్యవసాయ విధ్వంసం?22ఏ” అంశంపై రైతు సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల హరీష్ రెడ్డి మాట్లాడుతూ.. “రైతు బాంధవుడు కేసీఆర్.. రైతు ద్రోహి రేవంత్ రెడ్డి” అని విమర్శించారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్తో పాటు సాగునీటి ప్రాజెక్టుల ద్వారా రైతులకు అండగా నిలిచారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, రైతుబీమాపై నిర్లక్ష్యం వహించిందని, యూరియా?డీఏపీ కోసం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. యూరియా బస్తా ?270కు రావాల్సి ఉండగా బ్లాక్లో ?500 వరకు కొనాల్సిన పరిస్థితి వచ్చిందని, వరి కొనుగోళ్లలో కోతలు విధిస్తున్నారని విమర్శించారు.కేసీఆర్ పాలనలో నీళ్లు, కరెంటు, రైతుబంధు, సకాలంలో ఎరువులతో పాటు భూముల విలువ కూడా పెరిగిందని, ప్రస్తుతం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని హరీష్ రెడ్డి అన్నారు. రైతు కన్నీళ్లతో నడిచే ప్రభుత్వం ఎంతోకాలం నిలవదని, రాబోయే ఎన్నికల్లో రైతులు, అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మేకల సమ్మయ్య యాదవ్, అల్లం నారాయణ, బండారి ప్రవీణ్, జహీద్ భాషా, పోలాడి శ్రీనివాసరావు, బూరుగు వంశీకృష్ణ, బక్కి కిషన్,చొప్పరి శ్రీనివాస్, సార్ల ఉదయ్, ఎర్రవెల్లి శ్రీనివాసరావు, నూతి రాజకుమార్, కొండ సురేష్, పోయిల రవి, మేకల రామస్వామి, బొట్ల పోషం, గొర్రె శంకర్, గొర్రె నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్.ఐ .సి ప్రతిభ పోటీల్లో విజేతలు..


**జమ్మికుంట,** లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ సంస్థను స్థాపించి 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలోనూ, ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరము కూడా ఎల్ఐసి వారోత్సవాల్లో భాగంగా జమ్మికుంట పట్టణములోని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీ పరీక్షలు స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల (బాలికలు )లో ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ గణేష్ ఆధ్వర్యంలో, డెవోలోప్మెంట్ ఆఫీసర్ ఏల్పుల రాజేందర్ క్విజ్ మాస్టర్ గా వ్యవహరించారు. 5 రౌండ్ల లో సాగిన ఈ పోటీలలో జమ్మికుంట సోషల్ వెల్ఫేర్ పాఠశాల విద్యార్తులు వి.జస్వంత్, సిహెచ్.సాయి చరణ్, ప్రధమస్థానం. కాకతీయ హైస్కూల్ విద్యార్థులు వై.శ్రీకంఠసాయి, ఆర్ కౌస్తుబ్, ద్వితీయ స్థానం. విద్యోదయ విద్యార్థులు డి.అభిరూప్ లెనిన్,ఏ.రీత్విక్ లు తృతీయ స్థానం పొందారు. విజేతలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి సతీష్ కుమార్

# గత ప్రభుత్వ కాలంలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు..

**ప్రజా ప్రభుత్వంలో స్మార్ట్ కార్డుల పంపిణీ..**

**ఎండపల్లి మండలంలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు**

**రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్..**






**ఎండపల్లి, సెప్టెంబర్3, (నవగీతం)** బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో రేషన్ కార్డుల కొర కు దరఖాస్తులు చేసుకునేవారని కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో స్మార్ట్ రేషన్ కార్డులను అర్హులైన వారి అందజేస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రంలో గురువారం జరిగిన స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో రేషన్ కార్డుల కొరకు గ్రామానికి వచ్చిన నాయకులకు దరఖాస్తు చేసుకునే వారని అన్నారు. 2023లో మార్పు కోరుకొని ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వంలో అర్హులైన వారికి స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఉమ్మడి వెల్గటూర్ మండల అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నట్లు మంత్రి స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఇప్పటికే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం తో పాటు ధర్మపురిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశామని మంత్రి గుర్తు చేశారు. మండలంలో ఐటిఐ ఏర్పాటు చేస్తున్నామని ఎండపల్లి మండలంలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రి తెలిపారు. ఉమ్మడి వెల్గటూర్ మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి పాసిగాం గ్రామంలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలకు ధర్మపురిలో అందుబాటులో ఉంటూ బాధ్యత మర్చిపోకుండా అందరి సమస్యలు తీర్చు తున్నానని మంత్రి వివరించారు. నియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న రోళ్ళ వాగు ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేసి రంగదామునిపల్లి చెరువు అభివృద్ధితో పాటు జంగల్ నాల ప్రాజెక్టు అభివృద్ధి చేసి సాగునీటిని పూర్తిస్థాయిలో అందిస్తామని మంత్రి తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో కొండపల్లి మండలంలో 9,900 రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నామని మంత్రి తెలిపారు. రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. కొండపల్లి గ్రామానికి 33 ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. ఎండపల్లి గ్రామంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఎండపల్లి గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణం డ్రైనేజీ నిర్మాణం తో పాటు ఎస్సీ కమిటీ హాల్ నిర్మాణం పూర్తి చేస్తానని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఎండపల్లిలో ఎక్స్ ప్రెస్ బస్సు ఆపే విధంగా చర్యలు తీసుకుంటామని జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మారం సునీత, జగిత్యాల అడిషనల్ కలెక్టర్ కలెక్టర్ లతతో పాటు జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్ వివిధ శాఖల అధికారులు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

# ఘనపురం కాలనీ భూముల వివాదం .

**50 ఏళ్ల నుండి ఇక్కడ నివసించిన ఉన్నవారికే హక్కు.**

**వాజేడు మండలం ఎస్టీ సెల్ అధ్యక్షుడు రామ్మూర్తి అట్టం.**

ములుగు, సెప్టెంబర్03.(నవగీతం) ములుగు జిల్లా వాజేడు మండలం ఘనపురం కాలనీలోఇంటి స్థలాల విషయం లో భూముల వివాదం ముదురుతోంది. కాలనీ ఏర్పడి దాదాపు 50 సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ స్థలాలకు సరైన హక్కులు కల్పించకపోవడంతో స్థానికులు ఆందోళన బాట పట్టారు. గతంలో మానవతా దృక్పథంతో వలస వచ్చిన కొందరికి గ్రామ పెద్దలు కొంత స్థలాన్ని కేటాయించారని, ఆ కేటాయింపులో ఏ రాజకీయ పార్టీ ప్రమేయం లేదని గ్రామస్తులు తెలిపారు. అయితే ఇప్పుడు ఆ వలసదారులే మిగిలి ఉన్న ఖాళీ స్థలాలకు కూడా తమకే హక్కు కావాలని డిమాండ్ చేయడంతో అసలు గ్రామంలో పుట్టి పెరిగిన వారికి స్థలం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వివాదాన్ని ఆసరాగా చేసుకుని కొన్ని రాజకీయ పార్టీలు, కొందరు దళారులు అమాయక గిరిజన ప్రజలను మభ్యపెడుతూ "మీకు పట్టాలు ఇప్పిస్తాం" అంటూ డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో మండపాకలో ఇంటి స్థలాల విషయం లో ఇంటికి రూ. 2000 చొప్పున, "వసూలు చేశారని, అదేవిధంగా పేద ప్రజలు వ్యవసాయ నిమిత్తము లాలిపేట కూపు నరికిన విషయంలో ప్రతి ఒక్కరికి ఎకరం భూమి ఇస్తామని ప్రజలని మభ్య పెట్టి డబ్బు వసూలు చేసిన సంఘటన ఇంకా మర్చిపోలేదదని,నేడుమరలా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసే విధంగా ప్రయత్నిస్తున్నారని, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు రామ్మూర్తి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం పై ,పై అధికారులతో చర్చలు జరుపుతున్నామని వెల్లడించారు. ఈ విషయంపై గురువారం వాజేడు మండల ఎస్టీ సెల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామ్మూర్తి ములుగు జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి రాఘవులు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఘనపురం కాలనీ భూములు కేవలం గత 50 సంవత్సరాలుగా ఇక్కడే నివసిస్తున్న అసలు హక్కుదారులకే చెందుతాయని స్పష్టం చేశారు. వలస వచ్చిన గిరిజనులైనా,



ఆదివాసీలైనా ఎవరికీ ఈ మిగిలిన భూములపై హక్కు లేదని, పూర్తిగా గ్రామ మూలవాసులకే పట్టాలు వచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఎంఐఎంలో జరుగుతోంది

**హైదరాబాద్ :** హైదరాబాద్ రాజకీయాల్లో తిరుగులేని పట్టున్న ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ పార్టీలో తాజా పరిణామాలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. లైంగిక దుష్ప్రవర్తన ఆరోపణలతో కూడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్ వ్యవహారం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తప్పించడమే కాకుండా, ఎమ్మెల్సీ పదవికి కూడా తక్షణమే రాజీనామా చేయాలని అధిష్ఠానం ఆదేశించి నప్పటికీ, ఆయన ఇంకా రాజీనామా సమర్పించకపోవడం తీవ్ర ఉత్కంఠకు దారితీస్తోంది.పార్టీ ప్రతిష్టను కాపాడుకునేం దుకు ఎంఐఎం నాయకత్వం రహ్మత్ బేగ్‌పై వెంటనే బహిష్కరణ వేటు వేసి, శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేయాలని ఆదేశించింది. అయితే, ఆయన మాత్రం మండలి ఛైర్మన్‌కు రాజీనామా లేఖను సమర్పిం చడానికి ఏమాత్రం సుముఖంగా లేరన్న వార్తలు రాజకీయ వర్గాల్లో జోరుగా వినిపిస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం నుంచే ఆయన అజ్ఞాతంలోకి వెళ్లడం, తన ఫోన్లను స్విచ్ఛాఫ్ చేసుకోవడంతో పరిస్థితి మరింత జటిలంగా మారింది. పార్టీ అధిష్ఠానం ఒత్తిడి తెస్తున్నప్పటికీ, ఆయన స్వచ్ఛందంగా పదవిని వదులుకోవడానికి సిద్ధంగా లేరనే సంకేతాలు వెలువడుతున్నాయి.ఈ వివాదం తీవ్రరూపం దాల్చడంతో రహ్మత్ బేగ్ ఒక వీడియో ద్వారా తన వాదనను వినిపించారు. తనపై వచ్చిన ఆరోపణలను ఆయన పూర్తిగా ఖండించారు. తనను, పార్టీని రాజకీయంగా దెబ్బతీసేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగానే ఏఐ ఉపయోగించి మార్ఫింగ్ వీడియోలను సృష్టించి ప్రచారం చేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంతో పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీకి గానీ, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీకి గానీ లేదా ఎంఐఎం పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ కుట్రపై న్యాయపోరాటం చేస్తానని చెబుతూ ఇప్పటికే పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.సాధారణంగా ఎంఐఎం అధిష్ఠానం ఆదేశిస్తే నాయకులు ఎదురుచెప్పే పరిస్థితి ఉండదు. కానీ, రహ్మత్ బేగ్ రాజీనామా విషయంలో



నాన్చుడు ధోరణి ప్రదర్శించడం పార్టీ కేడర్‌తో పాటు రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరుస్తోంది. ఒకవేళ బేగ్ స్వచ్ఛందంగా రాజీనామా చేయకపోతే, పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం లేదా అనర్హత వేటు కోసం మండలి ఛైర్మన్‌ను ఎంఐఎం ఆశ్రయిస్తుందా? లేక అంతర్గతంగా ఆయనపై ఒత్తిడి తెచ్చి రాజీనామా చేయిస్తుందా? అనేది ప్రస్తుతానికి ప్రశ్నార్థకంగా మారింది. రహ్మత్ బేగ్ సోషల్ మీడియా ఖాతాలను పరిశీలిస్తే, ఇటీవల ఆయన సౌదీ అరేబియాలో ఉమ్రా తీర్థయాత్రకు సంబంధించిన పోస్టు తప్ప ఎలాంటి తాజా అప్‌డేట్‌లు లేకపోవడం గమనార్హం.మొత్తానికి, పాతబస్తీ రాజకీయాల్లో రహ్మత్ బేగ్ ఎపిసోడ్ ఎంఐఎం అధిష్ఠానానికి పెద్ద పరీక్షగా మారింది. ఆయన రాజీనామా లేఖ ఛైర్మన్‌కు చేరుతుందా లేదా న్యాయపరమైన, రాజకీయపరమైన పోరుకు ఆయన సిద్ధపడుతున్నారా అనేది రానున్న 24 నుంచి 48 గంటల్లో స్పష్టమయ్యే అవకాశం ఉంది.

## ఆర్.ఓ.ఎఫ్.ఆర్., భూ సమస్యల పరిష్కారానికి సమిష్టి కృషి

**మంచిర్యాల :** జిల్లాలోని ఆర్.ఓ.ఎఫ్.ఆర్. భూ సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేద్దామని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ?ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మంద మకరందు అన్నారు జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని గిరిజనుల అటవీ హక్కుల గుర్తింపు చట్టం భూ సమస్యలు తదితర అంశాలపై చర్చించారు గిరిజనులకు సంబంధించిన భూ సమస్యలను చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించేందుకు సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు తీసుకోవడం అర్హులైన గిరిజనులకు అటవీ హక్కుల చట్టం ద్వారా కల్పించాల్సిన హక్కుల అమలు అంశాలపై చర్చించారు. ఆర్.ఓ.ఎఫ్.ఆర్. భూములకు సంబంధించిన సమస్యలను పరిశీలించి క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు చేపట్టడం ద్వారా గిరిజనులకు ఇబ్బందులు లేకుండా చూడాలని గిరిజనుల భూ హక్కుల పరిరక్షణకు సంబంధిత శాఖలు సమన్వయంతో సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు.

## అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**కరీంనగర్** స్థానిక భగత్‌నగర్‌లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్, వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్, మంకమ్మతోటలోని అల్ఫోర్స్ ప్లానెట్ కిడ్స్‌లో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, భగవంతుడిని భక్తిశ్రద్ధలతో కొలిస్తే సుఖసంతోషాలు, శాంతి కలుగుతాయని అన్నారు. దేశవ్యాప్తంగా జన్మాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారని, శ్రీకృష్ణాష్టమికి మరో పేరు జన్మాష్టమి అని తెలిపారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు శ్రీకృష్ణ మహాత్మ్యం, శ్రీకృష్ణ లీలలను ప్రతిబింబించే నృత్య ప్రదర్శనలు చేసి ఆకట్టుకున్నారు. చిన్నారులు బాలకృష్ణుని వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా భక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ గంజాయి కింగ్‌పిన్ నీతూ బాయిపై ఈడీ దాడులు

**హైదరాబాద్ :** గంజాయి అక్రమ రవాణా కేసుల్లో కీలక నిందితురాలిగా ఉన్న నీతూ బాయి అలియాస్ 'గంజా క్వీన్'కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గట్టి షాక్ ఇచ్చింది. మనీలాండరింగ్ ఆరోపణల నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లోని 9 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. నీతూ బాయి, ఆమె అనుచరులతో సంబంధం ఉన్న నివాసాలు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ దాడులు నగరంలో కలకలం రేపాయి.తెలంగాణ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం 'ఈగల్' (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్), ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ గతంలో నీతూ బాయి, ఆమె ముఠాపై నమోదు చేసిన కేసుల ఆధారంగా ఈడీ ఈ మనీలాండరింగ్ విచారణను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 'నశా ముక్త్ భారత్' ప్రచారంలో భాగంగా మాదకద్రవ్యాల కేసులపై కేంద్ర ఏజెన్సీలు తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే ఈ సోదాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. సైబరాబాద్ నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్, ఎక్సైజ్ శాఖ నమోదు చేసిన పలు కేసుల్లో నీతూ బాయి పరారీలో ఉన్నట్టు రికార్డులు చెబుతున్నాయి.ఈగల్ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) కింద కేసు నమోదు చేసిన ఈడీ, గంజాయి అమ్మకాల ద్వారా వచ్చిన అక్రమ ఆదాయం, దానిని ఎలా మళ్లించారనే దానిపై దృష్టి సారించింది. ముఖ్యంగా ఈ అక్రమ వ్యాపారం ద్వారా సంపాదించిన కోట్లాది రూపాయలను హవాలా మార్గాల్లో తరలించినట్లు ఈడీ బలంగా అనుమానిస్తోంది. గంజాయి అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బుతో అక్రమంగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై ఈడీ లోతుగా దర్యాప్తు చేస్తోంది.ఈ సోదాల్లో భాగంగా అక్రమ ఆర్జనలకు సంబంధించిన ఆధారాలు, ఆస్తి పత్రాలు, బ్యాంకు ఖాతాలు, ఇతర రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గంజాయి వ్యాపారం ద్వారా వచ్చిన డబ్బును కుటుంబ సభ్యులు లేదా బినామీల పేర్లతో స్థిరాస్తులు, ఇతర ఆస్తులలో పెట్టుబడిగా పెట్టారా అనే కోణంలో కూడా విచారణ జరుపుతున్నారు.నానక్‌రామ్‌గూడలోని లోథా బస్తీలో ఉన్న నీతూ బాయి నివాసం, గంజాయి రిటైల్ అమ్మకాలకు అడ్డాగా మారిందని అధికారులు అనుమానిస్తున్నారు. ఆమె భర్త మున్నా సింగ్, కుమారులు గౌతమ్, గోవింద్, కుమార్తె ఈ వ్యాపారంలో పాలుపంచుకుంటూ గంజాయి ప్యాకింగ్, అమ్మకాలలో సహాయం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఈగల్ అధికారులు జరిపిన దాడుల్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లతో సహా పలువురు బానిసలు ఆమె ఇంటి నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించారుఅయితే, పలు కేసుల్లో నిందితురాలిగా ఉన్నప్పటికీ నీతూ బాయి అధికారులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతోంది. 2024లో సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ) ఆమె నివాసంపై దాడి చేసి 20 కిలోల గంజాయి, రూ. 20 లక్షల నగదును స్వాధీనం చేసుకుంది. సోదాలు ముగిసిన తర్వాత ఈ దర్యాప్తునకు సంబంధించిన పూర్తి వివరాలను ఈడీ వెల్లడించే అవకాశం ఉంది.

## ఎస్‌బీఐ వినియోగదారులకు షాక్




దేశంలోని ప్రముఖ బ్యాంక్ యూపీఐ ఈ బ్యాంక్ వినియోగదారులకు షాక్ ఇచ్చింది. తన యూపీఐ సేవలు ఫెయిల్ కానున్నాయి. ఈ రోజు (సెప్టెంబర్ 4) అర్ధరాత్రి 12:15 1 లేదా 1:15 వరకు యూపీఐ సేవలు నిలిపి వేయనున్నట్లు బ్యాంక్ తన శ ఖాతాలో పోస్ట్ చేసింది. ఈ మెయింటెనెన్స్ జరుగుతుండటంతో ఆ సమయంలో గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం, యోనో యాప్‌లు పనిచేయవు. ఎస్‌బీఐ అకౌంట్ నుంచి చేసే యూపీఐ పేమెంట్లు ఫెయిల్ అయ్యే అవకాశం ఉంది. అయితే యూపీఐ లైట్ సర్వీస్ మాత్రం ఎలాంటి ఆటంకం లేకుండా పనిచేస్తుంది. ఇదికూడా రూ.1000 లోపు చిన్న పేమెంట్లు అవసరం లేకుండా లైట్ ద్వారా చేసుకోవచ్చని వినియోగదారులకు సూచించింది. అర్ధరాత్రి కావడంతో పెద్దగా కస్టమర్లపై ప్రభావం ఉండదు. కాబట్టి ఆ సమయంలోనే ఈ మెయింటెనెన్స్ పనులు చేపడుతుంటాయి.

## స్టాక్ మార్కెట్‌లకు చమురు సెగ.. వరుసగా నాలుగో రోజూ నష్టాలే..!

దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాలతో ముగిశాయి. తొలుత లాభాల్లో సాగిన సూచీలు చివరికి అమ్మకాల ఒత్తిడితో కుప్పకూలాయి. అంతర్జాతీ యంగా పెరుగుతున్న ముడి చమురు ధరలు ద్రవ్యోల్బణంపై ఆందోళనలు పెంచడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. బాండ్ ఈల్డ్స్‌లో కదలికలు కూడా వడ్డీ రేట్లు ఎక్కువ కాలం కొనసాగొచ్చనే అంచనాలకు బలం చేకూర్చాయి. సెన్సెక్స్ 417.49 పాయింట్లు నష్టపోయి 76,152.86 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 41 పాయింట్లు తగ్గి 23,873.45 వద్ద ముగిసింది. నిఫ్టీకి 24,000 స్థాయి కీలకమైన అడ్డంకిగా ఉందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. దిగువన 23,800 స్థాయి తక్షణ కీలక మద్దతుగా ఉందన్నారు. ఈ స్థాయి కంటే నిఫ్టీ నిర్ణయాత్మకంగా దిగువకు వెళ్తే అమ్మకాలు మరింత పెరిగి 23,600 వరకు సూచీ పడిపోయే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొన్నారు. నిఫ్టీ షేర్లలో

Printed Published, Owned by PEMBI MAHENDHAR Printed at Saketh Publications, 312. Trinetra Complex, Sangareddy, Telangana 502001. Published from 11-65/49, PEDDAMMAWADA, MALLAPUR, JAGITIAL, TELANGANA - 505331. PH: 9912484184. Email : navageetamnews@gmail.com PRGI.NO:TGTEL/26/A2002. EDITOR: PEMBI MAHENDHAR.